
Follow: @ANNTELUGU
03-06-2025
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 181 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఎవరు గెలిచినా చరిత్రే!
### నేడే ఐపీఎల్ ఫైనల్ సమరం
ఉత్కంఠ రేపుతున్న చివరి మ్యాచ్
జోరు మీదున్న పంజాబ్ కింగ్స్ ఎలెవన్
కసి మీదున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
ఇప్పటివరకు ఒక్క ఐపీఎల్ టైటిల్ గెలవని 2 టీమ్స్
ఏ టీమ్ గెలిచినా ఈ సీజన్‌లో హిస్టరీ సృష్టించినట్లే
వర్షంతో మ్యాచ్ రద్దైతే తర్వాత
రోజుకు రిజర్వ్ డే ప్రకటించే చాన్స్
వివరాలు 3లో

టాప్ న్యూస్


## రెడ్ బుక్‌లో పేర్లు రాస్తున్నాం

- వచ్చే ఎన్నికల్లో రాబోయేది మా ప్రభుత్వమే
- ఇప్పుడు చెలరేగిపోతున్న వారిని హెచ్చరిస్తున్నాం
- మహిళలకు వడ్డీలేని లోన్స్ ఆధారం చూపిస్తే రాజీనామా చేస్తా
- సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు ఛాలెంజ్
- వచ్చే ఎన్నికల్లో సింగిల్‌గానే వస్తాం.. ఏ పార్టీతో పొత్తులేదని వ్యాఖ్య

02

## నోటీస్ కాదు.. నన్ను సస్పెండ్ చేయండి

- అప్పుడే అందరి జాతకం బయటపెడతా
- ఎమ్మెల్యే రాజాసింగ్

03

## బండి సంజయ్, కిషన్ రెడ్డిని తిరగనివ్వం

- కేంద్ర మంత్రులు వెంటనే క్షమాపణ చెప్పాలి
- రాహుల్ గాంధీపై లేనిపోని విమర్శలు చేస్తారా?
- తప్పు మీరు చేసి ఇప్పుడు ఆయనను అంటారా?
- ప్రతి అంశాన్ని రాజకీయం చేసి ఓట్లు దండుకోవడమేనా?
- బీజేపీ నేతలపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

02



## హరీశ్ వర్సెస్ మహేశ్
- ఇద్దరి మధ్య ఛాలెంజ్ వార్
- ప్రభుత్వం వడ్డీలేని లోన్స్ చూపించాలన్న హరీశ్ రావు
- నిరూపిస్తే తన పోస్టుకు రాజీనామా చేస్తానని మాజీ మంత్రి సవాల్
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ఎక్కడైనా చర్చకు సిద్ధమన్న టీపీసీసీ చీఫ్
- కాళేశ్వరంతో ఒక్క ఎకరాకు నీరు వచ్చిందా? అంటూ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్న
- పార్టీలో నాలుగు ముక్కలాట.. ఏ పార్టీ తరఫున పోటీ చేస్తావని ఎమ్మెల్సీ సెటైర్లు

వివరాలు 2లో



## తేనీటి విందుకు అందం..
- రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు
- పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు, అధికారులు
- ప్రత్యేక ఆకర్షణగా మిస్‌వరల్డ్ సుచాత, రన్నరప్‌లు

వివరాలు 3లో



## బంగారు తెలంగాణ ఎక్కడ?
### కేసీఆర్ కుటుంబం మాత్రమే అయ్యింది
గత పదేళ్లలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు
తెలంగాణ వచ్చాక నీళ్ల పేరుతో నిధుల దోపిడీ
తెలంగాణను 10 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారు
రాష్ట్రాన్ని దోచుకుంటున్న పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్
ఇది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ పాపం కాదా?
కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను పాతర వేయాల్సిందే
కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి ధ్వజం
వివరాలు 2లో




# దొంగలను పట్టిన విజిలెన్స్
## కాళేశ్వరంపై సంచలన రిపోర్ట్

02

### విజిలెన్స్ నివేదికలో విస్తుపోయే అంశాలు
57 మంది అధికారులు ఈ అక్రమాలకు బాధ్యులు
17 మంది ఇరిగేషన్ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాల్సిందే
ఇందులో ఈఎన్ సీలు, సీఈలు, ఎస్‌ఈలు, ఇంజనీర్లు
ఎల్‌అండ్‌డి సంస్థపై క్రిమినల్ చర్యలు చేపట్టండి
సర్కారుకు విజిలెన్స్ కమిషన్ రిపోర్ట్

కాళేశ్వరం ప్రాజెక్టు కుంగుబాటుపై ప్రభుత్వం విజిలెన్స్ ను కూడా విచారించమని ఆదేశించడంతో.. ఈ విచారణలో అనేక విస్తుపోయే అంశాలు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగం నిర్మించిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. తన పూర్తి స్థాయి నివేదికను సోమవారం ప్రభుత్వానికి అందించింది. ఈ బ్యారేజ్ కుంగుబాటుకు కారణమైన ప్రాజెక్ట్ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 17 మంది ఇరిగేషన్ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. ఎల్ అండ్ టి సంస్థపై సైతం క్రిమినల్ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పష్టం చేసింది. అలాగే ఈ నివేదికలో పలువురు ఈఎన్సీలతోపాటు ప్రస్తుత సీఈలు, ఎస్ఈల పేర్లను సైతం ప్రస్తావించినట్లు తెలుస్తోంది. - మహా, హైదరాబాద్,

## ముందు హరీశ్ రావే?
### ఆయన తర్వాత విచారణకు వెళ్తా!
- కాళేశ్వరం విచారణ తేదీ మార్చుకున్న కేసీఆర్
- 5న రాలేను.. 11న వస్తానని మాజీ సీఎం రిక్వెస్ట్
- తన అభ్యర్థనను అంగీకరించిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- జూన్ 6న ఈటల, జూన్ 9న హరీశ్ రావు కమిషన్ ముందుకు

02







## సంక్షేమ పథకాలకు పెద్దపీట
### పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు
- తెలంగాణ రైజింగ్ మనల్ని నడిపించే మంత్రం
- రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యం
- మహిళాభ్యున్నతికి ఏడాదిలోనే వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు
- యువత ప్రగతికి 16 నెలల్లోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం
- తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- సంక్షేమ పథకాల చరిత్రలో సన్నబియ్యం ఒక ట్రెండ్ సెట్టర్
- కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ దేశానికే రోల్ మోడల్
- రైతు సంక్షేమానికే రుణమాఫీ.. భూ యజమానులకు భరోసాకే భూభారతి
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మహా:** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని గుర్తుచేశారు. ధాన్య ఉత్పత్తిలో తెలంగాణ నెంబర్ వన్‌గా ఉందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఉపయోగపడేలా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ధరణి కొందరికి చుట్టమైతే.. భూభారతి ప్రజలకు రక్షణ చట్టమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద అమరవీరులకు సీఎం నివాళులర్పించారు.
మిగతా 3లో



## తెలంగాణనే ఫస్ట్
### పొజిషన్‌లో ఉన్నా.. అపోజిషన్‌లో ఉన్నా
ఎన్నారైలను చూసి తెలంగాణ గర్విస్తోంది
- మూడేళ్లలో తిరిగి మళ్లీ అధికారంలోకి వస్తాం
- ఎన్నికల్లో ఓడినా ప్రజల పట్ల ప్రేమ ఏమాత్రం తగ్గలే
- నాలుగు కోట్ల మంది ఆకాంక్షను కేసీఆర్ నెరవేర్చారు
- బీఆర్ఎస్ హయాంలో దేశానికే దిక్సూచిగా రాష్ట్రాన్ని చేశాం
- ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే సంక్షేమ పథకాలను అమలు చేశాం
- డల్లాస్ గడ్డపై బీఆర్ఎస్ రజతోత్సవాల్లో మాజీ మంత్రి కేటీఆర్ కీలక ప్రసంగం

03

## కవిత బీజేపీ వదిలిన బాణం!
6లో

# తేనీటి విందుకు అందం

### రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో ఏర్పాటు

పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు, అధికారులు

ప్రత్యేక ఆకర్షణగా మిస్‌వరల్డ్ సుచాత, రన్నరప్‌లు



**మహా:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. తాజా ప్రపంచ సుందరి ఓపల్ సుచాత నేతృత్వంలోని సుందరీమణుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గవర్నర్ ఇచ్చిన ఈ తేనీటి విందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ సహా పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, ఉన్నతాధికారుల కలయికతో రాజ్‌భవన్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ వేడుకలో సినీ నిర్మాత దిల్ రాజు దంపతులతో పాటు అంతర్జాతీయ అందాల పోటీల్లో విజేతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఇటీవల మిస్‌వరల్డ్‌గా కిరీటం గెలుచుకున్న థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాత, మొదటి రన్నరప్ ఇథియోపియాకు చెందిన హాసెట్ డెరెజే, రెండో రన్నరప్ పోలాండ్‌కు చెందిన మయా క్లైడా, మూడో రన్నరప్ మార్టినిక్‌కు చెందిన ఆరేలి జోచిమ్ ఈ విందులో పాల్గొన్నారు. వీరంతా రాజ్‌భవన్‌ను సందర్శించి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు.





# సంక్షేమ పథకాలకు పెద్దపీట



## పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు

- తెలంగాణ రైజింగ్ మనల్ని నడిపించే మంత్రం
- రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యం
- మహిళాభ్యున్నతికి ఏడాదిలోనే వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు
- యువత ప్రగతికి 16 నెలల్లోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం
- తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- సంక్షేమ పథకాల చరిత్రలో సన్నబియ్యం ఒక ట్రెండ్ సెట్టర్
- కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ దేశానికే రోల్ మోడల్
- రైతు సంక్షేమానికే రుణమాఫీ.. భూ యజమానులకు భరోసాకే భూభారతి
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)
అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. 'నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం.. విద్యార్థులుయువకులు, ఉద్యోగులుమహిళలు, మేధావులు, కవులు కళాకారులు, సకలజనులు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చుకున్న రోజు... ఇది మనందరం గర్వించదగిన రోజు. ఈ సందర్భంగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా.. ఈ రోజు రాష్ట్ర ప్రజల కలను నిజం చేసిన శ్రీమతి సోనియా గాంధీగారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ తెలంగాణ అమర వీరులకు ఘన నివాళులు అర్పిస్తున్నా. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం దశాబ్దాలుగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నం. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. అందుకే పదేళ్ల ఆధిపత్యాన్ని తిరస్కరించి ప్రజలు ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారు. డిసెంబర్ 7, 2023న మేం బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నం మొదలు పెట్టాం. మేం బాధ్యతలు చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. జరిగిన తప్పిదాలను సరిదిద్ది రాష్ట్రాన్ని గాడిన పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది. ఇది నల్లేరుపై నడక కాదని మాకు తెలుసు. అయినా ప్రజల ఆకాంక్షలనే ప్రజా ప్రభుత్వ ఎజెండాగా తెలంగాణ పునర్నిర్మాణం దిశగా ప్రయత్నిస్తూ ముందుకు కదిలామని' సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**కమిషన్‌ను ప్రక్షాళన చేసి..**

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించే పనులను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించామని సీఎం తెలిపారు. 'దేశంలో అదానీ, అంబానీలతో పోటీ పడేలా మహిళా స్వయం సహాయక సంఘాలతో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయించాం. పెట్రోల్ బంకులు, పాఠశాలల నిర్వహణ, యూనిఫాంల కుట్టుపనితో పాటు మహిళా శక్తి క్యాంటీన్లను నిర్వహించేలా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. తాము తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు అంతర్జాతీయ మార్కెట్‌లో మహిళా సంఘాలు పోటీ పడేలా హైటెక్ సిటీ పక్కన శిల్పారామంలో 100 ఇందిరా మహిళా శక్తి స్టాళ్లను ఏర్పాటు చేశాం. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాదు, ఆ బస్సులకు వారిని యజమానులుగా మార్చే కార్యక్రమాలను చేపట్టాం. మహిళా సంఘాల ద్వారా 600 బస్సులు కొనుగోలు చేయించి.. ఆర్టీసీకి అద్దెకు ఇచ్చే ఆలోచన చేశాం. ఇప్పటికే 150 బస్సులను వారికి అందజేసి రాష్ట్ర ఆర్థిక నిర్మాణంలో మహిళలను భాగస్వాములను చేస్తున్నాం. మహాలక్ష్మి పథకం ద్వారా రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నాం. తెలంగాణ పబ్లిక్ సర్విస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యా కమిషన్, వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసుకున్నాం. సమాచార కమిషనర్లను, లోకాయుక్త, హెచ్ఆర్సీ సభ్యులను నియమించుకుని, వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నాం. తెలంగాణ సమాజానికి పునాది మహిళలే. అందుకే కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే ఉక్కు సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి మిషన్ పాలసీని ఆవిష్కరించుకున్నాం. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్లు సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశామని' అన్నారు

**రూ.500 బోనస్ ఇస్తున్నాం..**

రాష్ట్రంలో మహిళలు మహాలక్ష్మిలా మారి సగర్వంగా నిలబడాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. 'రాష్ట్రానికి రైతే వెన్నెముక. అందుకే రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేశాం. కేవలం ఎనిమిది నెలల్లో 25లక్షల, 35వేల,964 మంది రైతులకు రూ.20,617 కోట్లు రుణమాఫీ చేసి అన్నదాతల రుణం తీర్చుకున్నాం. రూ.15,333 కోట్లతో రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.12వేలకు పెంచాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంతో భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబానికి ఏడాదికి రూ.12వేలు అందిస్తున్నాం. వరి ధాన్యానికి మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రిజర్వేషన్లు పెంచి బలహీన వర్గాల వారికి అండగా నిలవాలన్నదే ప్రజా ప్రభుత్వ విధానం. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు తీసుకున్నాం. కులగణన ద్వారా దేశానికే తెలంగాణను ఆదర్శంగా నిలిపాం. శాస్త్రీయంగా కులగణన నిర్వహించింది. బీసీల లెక్క 50.36 శాతంగా తేల్చాం. దానికి అనుగుణంగా బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచే నిర్ణయం తీసుకున్నాం. శాసనసభ, శాసన మండలిలో బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించుకున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాదు, వారు ఆత్మగౌరవంతో జీవించేలా సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించాం. సంక్షేమ పథకాల చరిత్రలో సన్నబియ్యం ఒక ట్రెండ్ సెట్టర్. తెలంగాణలో మూడు కోట్ల మంది సన్నబియ్యం పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

**తెలంగాణ పోలీస్ నెంబర్‌వన్..**

ప్రపంచ దేశాల నగరాలకు ధీటుగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మూసీ నదికి పూర్వ వైభవం తెచ్చేందుకు మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును చేపడుతున్నాం. బాపూఘాట్‌ను అంతర్జాతీయ స్థాయిలో గాంధీ సరోవర్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించాం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీని నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం. ఏఐ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఫార్మా సిటీలతో పాటు లైఫ్ సైన్సెస్, హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల్లో భాగంగా విమానాశ్రయాల సంఖ్యను పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణకు అన్ని అనుమతులు సాధించాం. హైదరాబాద్ నగర అభివృద్ధి లక్ష్యంగా దాదాపు రూ. 18వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాం. రీజనల్ రింగ్ రోడ్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నాం. రీజనల్ రైల్‌తో పాటు మెట్రో రైల్ విస్తరణ చేపడుతున్నాం. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రూ.24వేల కోట్లతో మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రాజెక్టును చేపడుతున్నాం. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖను మరింత పటిష్టపరిచాం. డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపేందుకు చర్యలు తీసుకున్నాం. ఇండియా జస్టిస్ రిపోర్ట్2025 ప్రకారం దేశంలోనే తెలంగాణ పోలీస్ నెంబర్‌వన్‌గా నిలిచింది.

## తెలంగాణ రైజింగ్ 2047 భవిష్యత్

మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అందించిన అలీన విధాన స్ఫూర్తితో ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమ్మిట్‌లో చర్చించాం. భారత్ సమ్మిట్ వేదికగా తెలంగాణ రైజింగ్‌ను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లాం. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రపంచ సుందరి పోటీలకు ఆతిథ్యం కల్పించాం. తెలంగాణ జరూర్ ఆనా అంటూ వందకు పైగా దేశాల నుంచి 72వ మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చారు. వారంతా తెలంగాణ చారిత్రక కట్టడాలను, టూరిస్ట్ ప్రదేశాలను సందర్శించి తెలంగాణ చారిత్రక వైభవాన్ని ప్రపంచ నలుదిశలా చాటారు. 2047 నాటికి భారతదేశం వందేళ్ల స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమవుతుంది. దేశాన్ని 30 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దడంలో తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అందుకే తెలంగాణ రైజింగ్2047 భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నాం. వచ్చే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిద్దాలని నిర్ణయించాం. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. తెలంగాణ రైజింగ్ మనల్ని నడిపించే మంత్రం. 2047నాటికి దేశంలోనే కాదు, ప్రపంచంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపే దిశగా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. పారదర్శక పరిపాలనతో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజా ప్రభుత్వానికి మీరంతా అండగా ఉంటారని ఆశిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.









# తెలంగాణనే ఫస్ట్

**మహా:** శూన్యం నుంచి సునామీ సృష్టించి, తెలంగాణ మిషన్ ఇంపాజిబుల్ అన్న పరిస్థితిని మిషన్ పాజిబుల్ అన్న పరిస్థితికి తెచ్చి ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ తెచ్చిన నాయకుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమెరికాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఎన్నారైలను చూసి తెలంగాణ తల్లి గర్విస్తున్నదని అన్నారు. అమెరికాలోని డాలస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ ఎరీనాలో రాష్ట్ర ఆవిర్భావ సంబురాలు, బీఆర్ఎస్ రజతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఎన్నారైలు పెద్దసంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల నాడు తెలంగాణ గడ్డమీద ఎలాంటి ఉత్సాహం కనిపించిందో ఇవాళ డాలస్‌లో కూడా అదే జోష్ కనిపిస్తుందని అన్నారు. ఇవాళ జరుగుతున్నది ఒక వేడుక మాత్రమే కాదు.. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం సర్వస్వాన్ని ధారపోసిన ప్రతి ఒక్కరి గురించి మాట్లాడుకునే సందర్భం ఇది అని అన్నారు. అభివృద్ధి, ఆత్మ గౌరవం, తెలంగాణ అస్తిత్వ లక్ష్యాల సాధన కోసం 20 సంవత్సరాల క్రితం ఒక స్వప్నం చిగురించింది. తెలంగాణ ప్రజల పోరాటాలతోనే చరిత్ర సృష్టించబడింది. తెలుగు వారికి రెండు రాష్ట్రాలు కాదు, మూడు రాష్ట్రాలు ఉన్నాయని టెక్సాస్ ను చూస్తే అనిపిస్తోంది.' అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను జరుపుకుందాం అనుకున్నప్పుడు తెలంగాణ ఎన్నారైలు ఏకగ్రీవంగా సూచించిన నగరం డాలస్ అని తెలిపారు. ఇవాళ తనకు అమెరికాలో ఉన్నట్లు అనిపించడం లేదని. వేలాదిగా తరలివచ్చిన ఎన్నారైలు, వాళ్ల ఉత్సాహాన్ని చూస్తుంటే హైదరాబాద్‌లో ఉన్నట్టే అనిపిస్తుందని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన కొత్తలో 2015లో పెట్టుబడుల కోసం డాలస్ నగరానికి వచ్చానని గుర్తుచేశారు. ఆనాడు ఆత్మవిశ్వాసంతో.. భవిష్యత్తు మీద నమ్మకంతో.. తెలంగాణ తరపున కేసీఆర్ దూతలుగా మేము చెప్పిన మాటలు, చేసిన వాగ్దానాలు నెరవేర్చడంతో పాటు చెప్పనివి కూడా ఎన్నో చేసి చూపించినందుకు గర్వంగా అనిపిస్తుందన్నారు. జీవితంలో కలలు చాలా మంది అంటారు. కానీ కొందరే సాకారం చేసుకుంటారని కేటీఆర్ అన్నారు.

**కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు..**

'ఒక విశ్వాసంతో, ఒక నమ్మకంతో, గుండె నిబ్బరంతో, తమ నమ్మకాన్ని పెట్టుబడిగా మలిచి స్వశక్తితో పైకి ఎదగడాన్ని చాలామంది అమెరికన్ డ్రీమ్ అంటారని.. మీరు ఎలా అయితే ఒక స్వప్నాన్ని చూశారో 2001 సంవత్సరంలో ఒక బక్క పలచని మనిషి కూడా ఒక కల కన్నాడు. ఆ కల తన కోసం కాదు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కోసం కన్నాడు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన మహాత్ముడి స్ఫూర్తితో.. బోధించు సమీకరించు పోరాడు అని చెప్పిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిగా.. ఐ హేవ్ ఏ డ్రీమ్ అని గర్జించిన మార్టిన్ లూథర్ కింగ్ స్ఫూర్తిగా చిమ్మచీకట్లలో ఒకే ఒక్కడుగా బయలుదేరి ఉద్యమ బాట నుంచి తప్పుకుంటే రాళ్లతో కొట్టి చంపండి అని పిలుపునిచ్చిన ఒకే ఒక నాయకుడు కేసీఆర్. ఆనాడు కేసీఆర్ పిలుపు మేరకు సకలజనులు ఏకమై అపూర్వ పోరాట సన్నివేశాలను ఆవిష్కరించి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నారు.' అని తెలిపారు. అమెరికా గడ్డపై కూడా ఎన్నారైలు.. మాతృభూమి కోసం జై తెలంగాణ అని నినదించి తమ పోరాట స్ఫూర్తిని ఘనంగా చాటారని కేటీఆర్ అన్నారు. కుట్రలను ఛేదించి, కుతంత్రాలను ఎదిరించి, అవమానాలను అధిగమించి అవరోధాలను కూకటి వేళ్ళతో పెకిలించి ఉద్యమ రథసారథి కేసీఆర్ నాయకత్వంలో ఏదైతే ఈ సుదీర్ఘ ప్రయాణం జరిగిందో ఇది దేశ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన రాజకీయ అధ్యాయమని తెలిపారు. మళ్లీ మూడేళ్లలో తిరిగి అధికారంలోకి వస్తామని.. తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. పదేళ్లపాటు ప్రభుత్వంలో ఉన్నప్పుడు దాన్ని బరువులా భావించలేదని.. బాధ్యతలా భావించామని తెలిపారు. ఉద్యమ స్ఫూర్తితోనే ప్రభుత్వాన్ని నడిపినందుకు అనితర సాధ్యమైన ఎన్నో విజయాలు సొంతమయ్యాయని అన్నారు. విడిపోతే విఫల రాష్ట్రం అవుతుందని హేళన చేసిన చోటనే విజయకేతనం ఎగరవేశామని.. మిమ్మల్ని పరిపాలించే నాయకులు ఉన్నారా అని గెలిచేసిన నోళ్ళతోనే మాకు కూడా మీలాంటి నాయకులు ఉంటే బాగుంటుందనిపించామని గుర్తు చేశారు.




# ఎవరు గెలిచినా చరిత్రే!

**మహా:** ఐపీఎల్ ఫైనల్‌లో రాయల్స్ బెంగళూర్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. నేడు జరిగే తుది పోరులో రెండు జట్లు అమితుమీ తేల్చుకోనున్నాయి. ఇప్పటి వరకూ అటు బెంగళూరు, ఇటు పంజాబ్ ఒక్క ఐపీఎల్ టోర్నీ కూడా గెలవలేదు. దీంతో ఎవరు విజేతగా నిలిచినా.. అది చరిత్రే. 18 సీజన్ల పాటు ఐపీఎల్ కప్పు బెంగళూరుని ఊరిస్తూనే ఉంది. 'ఈసారి కప్ మనదే' అంటూ ప్రతీసారీ అభిమానులకు మాట ఇవ్వడం, ఉత్తి చేతులతో ఇంటికి వెళ్లడం బెంగళూరుకు ఆనవాయితీగా వస్తోంది. ఈసారి మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ కప్పు చేజారిపోకూడదన్న కసి.. బెంగళూరు ఆటగాళ్లలో కనిపిస్తోంది. పైగా 18 అనేది కోహ్లీ జెర్సీ నెంబర్. ఇది 18వ ఐపీఎల్. సెంటిమెంట్ ప్రకారం.. కప్పు కొట్టే ఛాన్స్ బెంగళూరుదే అని అభిమానులు లెక్కలేస్తున్నారు. బెంగళూరు టాప్ ఆర్డర్ ఫామ్‌లో ఉండడం, కోహ్లీ నిలకడగా ఆడుతుండడం, బౌలర్లు సమష్టిగా రాణించడం, అభిమానుల అండ, దండ ఇవన్నీ బెంగళూరుకు ప్లస్ పాయింట్స్. పంజాబ్ కింగ్స్‌పై ముందు నుంచీ ఎవరికీ నమ్మకాల్లేవు. కానీ ఆ జట్టు అందరినీ ఆశ్చర్యపరుస్తూ అద్భుతమైన ఫలితాల్ని అందుకొంది. ఓపెనర్లు శుభారంభాల్ని అందిస్తున్నారు. ఇంగ్లీస్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. క్వాలిఫయింగ్ 2లో ముంబై చేతిలోంచి మ్యాచ్ లాగేసుకోవడం వెనుక ఇంగ్లీస్ పాత్ర కీలకం. బుమ్రా ఓవర్లో 20 రన్స్ కొట్టి, ముంబై ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీశాడు. బ్యాటింగ్ లైనప్ కూడా చాలా బలంగా ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా శ్రేయాస్ అయ్యర్ జట్టుని ముందుండి నడిపిస్తున్న విధానం అబ్బురపరుస్తోంది. కప్పు కొట్టాకే పండగ అన్నట్టు కనిపించాడు. మొత్తానికి ఏ జట్టు గెలిచినా అభిమానులకు ఆ సంబరం చూడడం కనుల పండుగగా ఉంటుంది.

# నోటీస్ కాదు.. నన్ను సస్పెండ్ చేయండి

### అప్పుడే అందరి జాతకం బయటపెడతా.. ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై గుర్రుగా ఉన్న గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్.. మరోసారి తన అసంతృప్తి వెళ్లగక్కారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వర్క్ షాపుకు రాజాసింగ్ దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్‌కు పార్టీ అధిష్టానం నోటీసులు ఇవ్వబోతుందనే వార్త మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనిపై స్పందించిన రాజాసింగ్.. 'మీడియాలో ఒక వార్త నడుస్తుంది, రాజాసింగ్‌కు నోటీస్ ఇవ్వడానికి పార్టీ ప్లాన్ చేస్తోందనే చర్చ తెరపైకి వచ్చింది. ఒకవేళ అదే నిజమైతే నోటీస్ కాదు.. ఏకంగా నన్ను సస్పెండ్ చేయండి' అంటూ రాజాసింగ్ సంచలన ప్రకటన చేశారు. అదే సమయంలో కొన్ని అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు రాజాసింగ్. ఒకవేళ నన్ను



సస్పెండ్ చేస్తే అప్పుడు అందరి జాతకం బయటపెడతా. ఎవరి వల్ల పార్టీకి నష్టం జరిగింది అనే నిజం చెప్పి అందరి జాతకం ప్రజలు ముందు పెడతా' అని రాజాసింగ్ పేర్కొన్నారు.

Z కేటగిరీ

# నిప్పు లేకుండా విలీనం పొగ ఎలా వచ్చును?

**"లోక్ సభ ఎన్నికలకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలు,ముఖ్యమైన నాయకులతో కేసీఆర్ సుదీర్ఘ మంతనాలు జరిపారు.బిజెపితో పొత్తు పెట్టుకొని పార్లమెంటు ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనను వారి ముందు పెట్టారు.కొందరు నాయకులు వ్యతిరేకించారు.మరికొందరు మాత్రం అంతా మీ ఇష్టం అని కేసీఆర్ పైనే నిర్ణయభారాన్నిపెట్టారు.కేసీఆర్ మనసులో ఎందుకో బిజెపితో పొత్తు విషయం బలంగా నాటుకుపోయింది. కొంతమంది అభ్యంతరాలు వ్యక్తం చేసినా, అంతిమంగా పొత్తు తప్పదనే అనుకున్నామని కేసీఆర్ తో భేటీ ముగిసి వెలుపలికి వచ్చిన వారిలో కొందరు ఎమ్మెల్యేలు చెప్పారు" అని ప్రముఖ న్యూస్ ఛానల్ విలేకరి ఒకరు జూన్ 1 న నాతో అన్నాడు.బిజెపిలో విలీనం కన్నా పొత్తు అంశమే అప్పట్లో చర్చ జరిగినట్టు ఆయన ధృవీకరించాడు.**






కాగా ''భారతీయ జనతా పార్టీలో బీఆర్ఎస్ విలీనం తథ్యం.పార్టీ విలీనం తర్వాత కేసీఆర్కు గవర్నర్,కేటీఆర్కు కేంద్ర మంత్రి, హరీశ్‌రావుకు అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పదవి ఇవ్వనున్నారు.బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీలు బీజేపీలో విలీనం కాగానే కవితకు బెయిల్ వస్తుంది''అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2024 ఆగస్టులో ఢిల్లీలో మీడియా చిట్ చాట్ లో అన్నారు.రేవంత్ వ్యాఖ్యల్ని అప్పట్లో ఎవరూ సీరియస్ గా తీసుకొని ఉండకపోవచ్చు.కానీ ఇదే మాట ఎమ్మెల్సీ కవిత నోటి నుంచి రావడం వల్ల రాజకీయ దుమారం చెలరేగుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందరికన్నా ముందే 'విలీనం పొగ' కనిపించింది.

''బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి సంబంధించిన కుట్ర జరుగుతోంది'' అంటూ కవిత వ్యాఖ్యలు చేయడంతో,ఆ వ్యాఖ్యల చుట్టూ తెలంగాణ రాజకీయాలు నడుస్తున్నవి.ఈ ప్రచారం ఊపందుకుంది.ఈ అంశంపై బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి ఖండనలు, వివరణలు రావడంలేదు.ఒకరిద్దరు ఖండించినా అందులో పస కనిపించడం లేదు. తెలంగాణ రాజకీయాల్లో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకోవడం 2023 చివర అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఓటమిపాలయిన నాటినుంచే ప్రారంభమయ్యాయి.

**పూర్తిగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నట్లుగా అనేక పరిణామాలు స్పష్టతనిస్తున్నవి. అయితే బీజేపీతో పొత్తులు పెట్టుకుంటారా లేకపోతే, పూర్తి విలీనమా ?లేకపోతే రాజ్యసభ పక్ష విలీనానికే పరిమితమవుతారా? అంటూ 2024 జూన్,జూలై ప్రాంతాల్లోనే ఒక చర్చ నడిచింది.కవిత జైలులో ఉన్న సందర్భంలో కేటీఆర్,హరీష్ రావు దాదాపు వారం రోజుల పాటు ఢిల్లీలో మకాం వేశారు.వారు ఏం చేశారో తెలియదు కానీ, ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న తర్వాత బీజేపీ,బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందన్న ప్రచారం ఊపందుకుంది. ముందుగా బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు నలుగురు బీజేపీలో విలీనం అయిపోతారని,తరవాత పార్టీ విలీనం గురించి ఆలోచిస్తారని ఢిల్లీలో ప్రచారం సాగింది.**

బీఆర్ఎస్ రాజ్యసభ పక్షం బీజేపీలో విలీనం అయ్యేందుకు ఏర్పాట్లు పూర్తయినట్లుగా ఢిల్లీలో ప్రచారం ఊపందుకున్నట్టు కొన్ని వెబ్ సైట్ లలో వార్తా కథనాలు వెలువడ్డాయి.ఇలాంటి ప్రచారం జరుగుతున్న సమయంలో బిఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు ఉపరాష్ట్రపతి,రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్ ఖడ్ తో సమావేశం అయ్యారు.విలీన అంశంపై చర్చలు జరిపారని వదంతులు వచ్చాయి. కేఆర్ సురేష్ రెడ్డి,వద్దిరాజు రవిచంద్ర,హెటెరో పార్థసారధి రెడ్డి, దామోదర్ రావు బీఆర్ఎస్ తరపున రాజ్యసభ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున ఒక్క ఎంపీ కూడా గెలవకపోవడంతో లోక్ సభలో బిఆర్ఎస్ ప్రాతినిధ్యం కోల్పోయింది.మరో ఎంపీ కేశవరావు కాంగ్రెస్ లో చేరి,తన పదవికి రాజీనామా చేశారు.

''రాజ్యసభ సభ్యులు కేసీఆర్ ను ధిక్కరించి పార్టీ మారుతారని ఎవరూ అనుకోవడం లేదు.నలుగురు రాజ్యసభ సభ్యుల ఎంపీల విలీన రాజకీయం బీఆర్ఎస్ హైకమాండ్ కు తెలిసే జరుగుతోందని కేటీఆర్,హరీష్ ఢిల్లీ పర్యటనను బట్టి ఇక్కడి రాజకీయ వర్గాలు అంచనా వేశాయ''ని ఢిల్లీ విలేకరి ఒకరు అప్పట్లో చెప్పారు.''రాజ్యసభలో బీజేపీకి పూర్తి మెజార్టీ లేదు.అందుకే రాజ్యసభ ఎంపీలను విలీనం చేసుకోవాలన్న ఆలోచనకు వచ్చినట్లున్నది.దీనికి బీఆర్ఎస్ పెద్దలు కొన్ని షరతులతో అంగీకరించారు. 2019లో ఏపీలో టీడీపీ ఓడిపోయినప్పుడు ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరిపోయారు.చంద్రబాబుకు అత్యంత సన్నిహితులుగా ముద్రపడిన సుజనా చౌదరి, సీఎం రమేష్ వంటి వారు కూడా బీజేపీలో చేరారు.ఒక్క కనకమేడల రవీంద్ర మాత్రమే ఉండిపోయారు. మిగిలిన టీడీపీ రాజ్యసభ పక్షాన్ని విలీనం చేశారు.ఆ విలీనం జరిగినప్పుడు చంద్రబాబు విదేశీ పర్యటనకు వెళ్లారు. అయితే అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరిగిందని అనుకుంటూ ఉంటారు.వారిపై అనర్హతా వేటు వేయాలని ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదు.ఆ ఎంపీలపైనా ఎప్పుడూ తీవ్ర విమర్శలు చేయలేదు. ఆ ఎంపీలు.. చంద్రబాబు,టీడీపీ పట్ల సానుకూలంగానే ఉండేవారు. కానీ తర్వాత వారి పదవి కాలం అయిపోయినా వాళ్లు టీడీపీలోకి రాలేదు.బీజేపీనే అంటి పెట్టుకుని ఉన్నారు. బీజేపీకి, టీడీపీకి మధ్య సత్సంబంధాలు ఏర్పడ్డాయి. పొత్తుల్లో భాగంగా ఆ ఎంపీలకు కొన్ని చోట్ల సీట్లు లభించాయి. ఇప్పుడు అదే తరహాలో బీఆర్ఎస్ కూడా రాజ్యసభ సభ్యుల్ని విలీనం చేసేస్తుందని ఇక్కడ ప్రచారం సాగింది''అని ఆయన కొనసాగించారు.

రాజ్యసభ పక్ష విలీనంపై జోరుగా చర్చలు జరుగుతున్న వేళ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు స్పందించలేదు. కేసీఆర్ అసలు ఎవరికీ అందుబాటులో లేరు. కేటీఆర్,హరీష్‌రావు అందుబాటులో ఉన్నా ఎలాంటి ప్రకటన చేయ లేదు. మామూలుగా అయితే ఇలాంటి ప్రకటనలు వస్తే కేటీఆర్ తీవ్రంగా స్పందిస్తారు. న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తారు. కానీ కేటీఆర్, హరీష్ ల మౌనం .. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అభిప్రాయం కలిగించడానికి కారణం అవుతోందని అప్పట్లో ప్రచారమూ ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ అత్యంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు బ్యాంక్ పదహారు శాతానికి పడిపోయింది.భవిష్యత్తులో రెండు జాతీయ పార్టీలతో పోరాడటం అంత తేలిక కాదని కేసీఆర్ భావించినట్టు ఆ పార్టీ వర్గాలలో ఏడాది కిందటే ఒక ప్రచారం సాగింది.ఏదో ఓ జాతీయ పార్టీ అండ ఉండాలనుకున్నారని మరో వార్తాకథనం వచ్చింది. బీజేపీతో కలిస్తే రేవంత్ సర్కార్ ను కూలగొట్టి బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చన్న ఆలోచనలో ఉన్నట్లుగా గతంలో ప్రచారం జరిగింది.కానీ ఇలాంటి ప్రమాదాన్ని ముందుగానే రేవంత్ ఊహించి ముందుగానే 10 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలు చేసుకున్నారు.

''కవితను అరెస్ట్ చేయకుండా ఉండేందుకు బీజేపీలో బీఆర్ఎస్ విలీనానికి ప్రయతించిన మాట నిజమే. లిక్కర్ స్కామ్ లో కవిత అరెస్ట్ అయి జైల్లో ఉన్నప్పుడే ఈ ప్రతిపాదన వచ్చింది.అయితే కుటుంబ,అవినీతి పార్టీ అయిన బీఆర్ఎస్ ను మేము దరిదాపుల్లోకి కూడా రానివ్వలేదు" అని కేంద్రమంత్రి బండి సంజయ్ మే 31 న అన్నారు.బిజెపిలో బిఆర్ఎస్ విలీనానికి సంబంధించిన వ్యవహారంపై పరిస్థితులు భగ్గున మండిపోతున్న దశలో అందుకు బలం చేకూర్చేలా బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలు చేసి నిప్పును మరింత ఎగదోశారు.

**"కవిత మాటలతో ఏకీభవిస్తున్నా. భారీ`ప్యాకేజీ ఇచ్చి ఉంటె అప్పట్లో బీజేపీయే బీఆర్ ఎస్‌లో విలీనం అయి ఉండేది.మావాళ్లను తక్కువగా అంచనా వేయలేం.సీఎం పదవి వంటి ఆఫర్ ఇస్తే మా పార్టీ ఎప్పుడో బీఆర్ ఎస్‌లో కలిసిపోయి ఉండేది.కానీ అదే జరగలేదు.అందుకే చేరలేదు.ఒకవేళ బీఆర్ ఎస్‌లో కనుక బీజేపీ చేరిపోయి ఉంటే మేమందరం చేతులు కట్టుకుని ఉండే పరిస్థితి వచ్చేది.ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేయాలన్న విషయాన్ని బీఆర్ ఎస్ నిర్ణయించేది.ఇప్పటికీ క్షేత్రస్థాయిలో మిలాఖత్ రాజకీయాలు జరుగుతూనే ఉన్నాయి.అందుకే పార్టీ నష్టపోతున్నది.నిజానికి మా పార్టీ అధికారంలోకి రావాల్సి ఉంది.కానీ, ఎందుకు రాలేదు? క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది? ఒక్కసారి ఆలోచన చేయండి." అని రాజాసింగ్ కామెంట్ చేశారు.**

కాగా బిఆర్ఎస్ పార్టీ, బీజేపీలో విలీనమవుతోందంటూ ప్రత్యేక కథనం పేరుతో ఆర్ టీవీ ప్రసారం చేసిన కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.సంబంధిత కథనాలను, విడియోలను తమ యూట్యూబ్ చానెల్,డిజిటల్ ప్లాట్ఫారంలు, సామాజిక మాధ్యమాల నుండి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేసింది.పరువునష్టం కలిగించే వార్తలు,ఉద్దేశపూర్వకంగా అపవాదు కలిగించే నిరాధార కథనాలు ప్రసారం చేసినందుకుగానూ బేషరతుగా క్షమాపణ చెబుతూ, వెంటనే అవన్నీ తమ అన్ని రకాల ప్లాట్ఫారంల నుండి తొలగించాలని ఆర్టీవీ నిర్వహిస్తున్న రవిప్రకాష్ కు లీగల్ నోటీసులు జారీచేశారు.ఆ టీవీ వార్తా కథనాల ప్రసారంతో ప్రజలు, బిఆర్ఎస్ కార్యకర్తలు ఆయోమయానికి గురవుతున్నారని లీగల్ నోటీసుల్లో బిఆర్ఎస్ తెలిపింది.

బీజేపీలో బిఆర్ఎస్ విలీనం పేరిట కొంతమంది వ్యక్తులు,కొన్ని రాజకీయ శక్తులు కుట్ర చేస్తున్నట్టుగా పార్టీ సీనియర్ నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.అయితే ఇటీవలి కాలంలో ఈ చర్చకు నాంది పలికిన వ్యక్తి సాక్షాత్తు ఆ పార్టీ అధినేత కేసీఆర్ కూతురు కవిత.మధుసూదనాచారి కథనం ప్రకారం 'కుట్ర రాజకీయాల్లో' కవిత కూడా భాగస్వామిగా ఉన్నట్లు భావించాలా? లేక ఆమెను మినహాయించాలా?బిఆర్ఎస్,బిజెపి విలీనం లేదా పొత్తులకు సంబంధించిన అంశంపై కేసీఆర్ మాత్రమే స్పష్టత ఇవ్వవలసి ఉంటుందని రాజకీయ పరిశీలకులంటున్నారు.

అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో రాజకీయ గండరగండుడుగా పేరున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విఫలమవుతున్నారు. ప్రజాసమస్యలపై, పార్టీలో జరుగుతోన్న పరిణామాలను ఆయన పట్టించుకోక పోవడమే ఇందుకు కారణాలుగా చూపుతున్నారు.ప్రతిపక్షనేతగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనా కనీసం నోరు విప్పట్లేదనే విమర్శలు మొదటి నుంచీ కేసీఆర్‌ను వెంటాడుతున్నాయి. సొంత పార్టీలో జరుగుతున్న పరిణామాలను సైతం ఆయన నియంత్రించలేకపోతున్నారు.అందుకే కూతురు కవిత ధిక్కార స్వరం వినిపిస్తున్నారనే చర్చ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

సాధారణంగా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి నాయకులు,కేడర్‌కు నిత్యం అందుబాటులో ఉండటం సహజం. అందులో ప్రతిపక్ష నాయకుని పదవిలో ఉంటే ఇంకా బిజీగా ఉంటారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం అనునిత్యం ఏదో ఒక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.అందుకు ఏపీలో చంద్రబాబు నాయుడును ఉదహరిస్తూ ఉంటారు.ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన నిత్యం ప్రజల్లో ఉంటూ మళ్లీ ఎన్నికలు వచ్చేంత వరకూ వారి మధ్యనే కనిపించారు.కానీ, కేసీఆర్ మాత్రం అధికారం పోయిన తర్వాత నుంచి ప్రజలకు అందుబాటులో లేకుండా కేవలం ఫామ్‌హౌజ్ కు పరిమితమయ్యారు.ప్రతిపక్షనేతగా ఆయన అసెంబ్లీలో జరిగిన చర్చల్లో ఇప్పటి వరకూ పాల్గొనలేదు. కేవలం రెండు సార్లు మాత్రమే వచ్చి వెళ్లారు.అలాగే ప్రతిపక్ష నేతగా రాజ్‌భవన్‌లో జరిగే ఏ కార్యక్రమానికీ కేసీఆర్ హాజరు కాలేదు.

పార్టీలో జరుగుతోన్న పరిణామాలను కేసీఆర్ పట్టించుకోకపోవడం వల్లనే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ వీడారనే టాక్ ఉన్నది. పార్టీ నుంచి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎమ్మెల్యేలతో మాట్లాడి వారిలో భరోసా నింపే ప్రయత్నం చేసి ఉంటే కొందరైనా అందులోనే కొనసాగే వారనే అభిప్రాయాలున్నాయి.పార్టీ నాయకులతో తరచూ సమావేశాలు పెట్టేందుకు,సమీక్షలు నిర్వహించేందుకు కేసీఆర్ వ్యతిరేకం.''కొంతమంది వ్యక్తుల కారణంగానే జిల్లా నాయకులకు కూడా కేసీఆర్ అపాయింట్ మెంటు దొరకడం లేదు'' అని ఆయన కూతురు కవిత విమర్శించిన తర్వాత అయినా ఫార్మ్ హౌజ్ లో పరిస్థితులు మారుతాయన్న ఆశలేమీ లేవని ఆ పార్టీ శ్రేణులే అంటున్నవి.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**25 ఏళ్ల టిఆర్ఎస్ ప్రస్థానంలో చాలా మంది కేసీఆర్‌ను విబేధించి బయటికి వచ్చారు.అందులో కొందరిని బలవంతంగా సాగనంపేందుకు పరిస్థితులు సృష్టించారనే విమర్శలున్నవి. ఇంకొందరు బహిరంగంగా కేసీఆర్‌పైనే విమర్శలు చేసి బయటికొచ్చారు.అయితే, తనకు ఇష్టం లేని నాయకుడ్ని ఎప్పుడు బయటకు పంపించాలో కేసీఆర్ నిర్ణయం తీసుకునే వారనే టాక్ ఉంది. కొన్ని సార్లు అవి వికటించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ సొంత కూతురు కవిత పార్టీ పనితీరును బహిరంగంగా ప్రశ్నించే వరకు ఎందుకు వచ్చింది? దీనిని ఆయన ముందుగానే గ్రహించారా? ఒక వేళ తెలిసినా పట్టించుకోలేదా? అనే ప్రశ్నలు రాజకీయంగా చక్కర్లు కొడుతున్నాయి. కవిత బయటకు వెళ్లి పార్టీపై విమర్శలు చేస్తే ఆ పరిణామాలు ఏ విధంగా ఉంటాయో కేసీఆర్‌కు తెలుసు.అందుకోసం ఆమెను వారించడమో లేదా బుజ్జగించడమో వంటి పనులు ఎందుకు చేయలేదు? ఒక వేళ ఆ ప్రయత్నాలు చేసి కేసీఆర్ విఫలమయ్యారా? అనే చర్చ హాట్ టాపిక్‌గా మారింది.**

కవిత లేవనెత్తిన అంశాలను సమర్ధించే బీఆర్ఎస్ నాయకులు చాలామంది ఉన్నారు పార్టీ మనగడ కోసం ఆమె చేసిన సూచనలు సరైనవే అంటూ కొందరు అంటున్నారు.దీంత ఈ రకంగానూ కేసీఆర్‌కు కేడర్ నుంచి నిరసన ఎదురవుతోంది. కవిత స్థానంలో మరో ఇతర నేత ఎవరైనా బహిరంగంగా వ్యాఖ్యలు చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది. వెంటనే సదరు నేతకు నోటీసులు ఇవ్వడమో లేక పార్టీ నుంచి బహిష్కరించడమో వంటి చర్యలుండేవి.అలాంటి ఉదంతాలు గులాబీ పార్టీలో ఇప్పటి వరకు చాలా జరిగాయి. తొలిసారి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో డిప్యూటీ సీఎంగా ఉన్న రాజయ్యను పదవి నుంచి బర్తరఫ్ చేశారు.ఎందుకు ఆ విధంగా చేశారో ఇప్పటి వరకూ ఎవరికీ తెలియని విషయం. రెండో సారి అధికారంలోకి వచ్చాక మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ ను బర్తరఫ్ చేశారు. ఈటలపైనా అంత కఠిన నిర్ణయం తీసుకోవడానికి కారణాలు ఎంటో అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది.

**తెలంగాణ ఉద్యమ కాలం నుంచే కేసీఆర్ వైఖరి ఇలాగే ఉండేది.రోజుల తరబడి ఎవరికీ అందుబాటులో ఉండేవారు కాదు.అయన ఎక్కడున్నారో ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్న సందర్భాలున్నాయి.హఠాత్తుగా ఒక రోజు మీడియా ముందుకొచ్చి కొత్త వ్యూహంతో అప్పటి ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టిన సందర్భాలు,ఆ తర్వాత ఆయన చుట్టూ రాజకీయాలు కొనసాగిన ఉదంతాలు ఉన్నాయి. "ఇదంతా ఉద్యమ కాలంలో జరిగింది. ఆనాడు ప్రజల్లో తెలంగాణ రాష్ట్రం కావాలనే బలమైన ఆకాంక్ష ఉండేది. కేసీఆర్ ఏది చేసినా జై కొట్టారు. ఇప్పుడూ అదే తరహా వ్యూహాలు రచిస్తే సానుకూల వాతావరణం వచ్చే పరిస్థితులు లేవు" అని పార్టీ నాయకులు ఆఫ్ ద రికార్డుగా చెబుతున్నారు.**

ఇదిలా ఉండగా కవిత ఎపిసోడ్ కారణంగా బిజెపి,బిఆర్ఎస్ రెండూ ఒక్కటే అనే అభిప్రాయం ప్రజల్లో బలంగా వెళ్లినట్టు ముఖ్యమంత్రి రేవంత్ కు కొందరు మంత్రులు వివరించారు.క్షేత్ర స్థాయిలో ప్రభుత్వంపై కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ తాజా రాజకీయ పరిణామాలతో పరిస్థితులు కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారుతున్నట్టు మంత్రులు అభిప్రాయపడినట్టు తెలియవచ్చింది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# అభివృద్ధి, సంక్షేమంలో జిల్లా ముందంజ

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ.. ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఆదిలాబాద్, మహా:** అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో ఆదిలాబాద్ జిల్లా అన్ని రంగాల్లో అభివద్ధి చెందుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. తొలుత ఎన్టీఆర్ చౌక్ లోని అమరవీరుల స్థూపం, జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. అనేక మంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని వివరించారు. రాష్ట్రాన్ని దేశంలో అగ్ర స్థానంలో నిలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి రైజింగ్ 2047 విజన్ తో ముందుకు సాగుతోందని చెప్పారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, పారదర్శక సుపరిపాలన లక్ష్యాలకు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహాలక్ష్మీ, ఉచిత విద్యుత్తు, గ్యాస్ రాయితీ, నిరుపేదలకు సన్నబియ్యం, ఎస్సీ వర్గీకరణ, యువతకు ఉపాధి అవకాశాలు తదితర వాటిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నార్నూర్ అస్పిరేషన్ బ్లాక్ లో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులు, ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, శాసన సభ్యులు పాయల్ శంకర్, అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజా రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజా సేవాభవన్‌లో రాష్ట్రావతరణ దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకావిష్కరించిన కంది శ్రీనివాస రెడ్డి**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు**

**ఆదిలాబాద్, మహా :** అనేక ఆశయాలు, ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చాలా వెనుకబడిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. తెలంగాణా రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ శ్రేణులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. స్వరాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకనుగుణంగా పని చేస్తూ వారి విశ్వాసాన్ని పొందిందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నోమంచి పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, నాగర్ కర్ శంకర్, ముజాహిదీన్, లోక ప్రవీణ్ రెడ్డి, సుధాకర్ గౌడ్, బండి దేవిదాస్ చారి, బండారి సతీష్, జాఫర్ అహ్మద్, రామ్ కుమార్, ఎంఏ షకీల్, రఫీక్, ఆశన్న, మంచాల మల్లయ్య, దీపక్ రావు, కందుల సుఖేందర్, రమేష్, ప్రభాకర్, అబ్దుల్లా, అంజాద్, అయాష్, ఫజిల్, దేశెట్టి ప్రభావతి, లతా, సోనియా, శ్రీలేఖ, అఫ్రోజ, షబానా, మందాకిని తదితరులు పాల్గొన్నారు.



## కేశంపేట్ లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

**షాద్ నగర్, మహా:** కేశంపేట మండల కేంద్రంలో ఈరోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఎంపీడీవో మరియు ఎంఆర్ఓ ఆఫీస్ నందు స్థానిక ఎమ్మార్వో మరియు ఇంచార్జ్ ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన జడ్పీటిసి విశాల శ్రావణ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కేశంపేట మండలం నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

## డల్లాస్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని కలిసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

- ఎమ్మెల్సీగా ఎన్నికై నేటికి సంవత్సరం పూర్తి చేసుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి
- నవీన్ రెడ్డిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్



**షాద్ నగర్, మహా:** అమెరికాలోని డల్లాస్ లో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ మరియు బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు ముఖ్య అతిదిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కేటీఆర్ కి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో నవీన్ రెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీగా ఎన్నికై నేటికీ సంవత్సరం పూర్తి కావడంతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కేటీఆర్ అభినందిస్తూ 2023 సాధారణ ఎన్నికల తర్వాత పాలమూరులో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సిగా నీగెలుపుతో నాయకులకు కార్యకర్తలకు ఎంతో ధైర్యాని పెంచిందని శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఆశీర్వదించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.



## పోచమ్మ ఆలయాన్ని సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి బేల మండలంలో పర్యటించారు. సోమవారం అవల్పూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో నూతనంగా ప్రతిష్టించిన అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట ఆదిలాబాద్, బేల మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ ను సందర్శించిన షబ్బీర్ అలీ

**ఆదిలాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ ను సందర్శించారు. సోమవారం తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పుస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం కంది శ్రీనివాస రెడ్డి ఆహ్వానం మేరకు ప్రజాసేవాభవన్ కు విచ్చేశారు. ఆయనకు పార్టీ శ్రేణులతో కలిసి కంది శ్రీనివాస రెడ్డి ఘన స్వాగతం పలికారు, శాలువాలతో సత్కరించారు.

## ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను జైలులో పెట్టాలి

**సనాతన ధర్మం పై పవన్ కళ్యాణ్ కి అవగాహన లేదు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**



**బాలాపూర్ మహా:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇస్కఫ్ అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యం లో సరూర్ నగర్ లో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ చేసిన తప్పుడు పనులు కాంగ్రెస్ పార్టీ చేయొద్దని ఇచ్చిన హామీలను అమలు చేయడం సాధ్యం కానప్పటికీ, ప్రభుత్వానికి నష్టం కలవకుండా ఉండాలంటే వచ్చిన హామీలను అమలు చేసి తీరాలని నారాయణ తెలిపారు. సనాతన ధర్మమంటే పవన్ కళ్యాణ్ కు అవగాహన లేదని నారాయణ మండిపడ్డారు. సనాత ధర్మానికి మద్దతు తెలుపుతున్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కళ్యాణ్ కళ్యాణ్ జైల్ లో పెట్టాలని నారాయణ అన్నారు. సనాతన ధర్మం అనేది పాతకాలం సంబంధించిన అంశమని భర్త చనిపోతే భార్య కూడా చనిపోయేదని ఇప్పుడు పవన్ కళ్యాణ్ చనిపోతే వారి భార్య చనిపోతుందా అంటూ ప్రశ్నించారు. ముగ్గురు భార్యలను చేసుకున్న పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కెసిఆర్ పరిపాలనలో కుటుంబం మొత్తం తెలంగాణ సంపదను దోచుకతిన్నారని విమర్శించారు. ప్రస్తుతం కేసీఆర్ కుటుంబ సభ్యులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

## సివిల్స్ ర్యాంకర్ భరద్వాజ్ ను ఘనంగా సన్మానించిన మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ పట్టణానికి చెందిన భరద్వాజ్ సివిల్స్ ఫలితాలలో 905 ర్యాంకు సాధించడం పట్ల మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అభినందనలు తెలిపారు. అదేవిధంగా పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. భరద్వాజ్ పట్టుదలతో ర్యాంకు సాధించడం సంతోషకరమని, తోటి విద్యార్థులకు ఆదర్శనీయమని కొనియాడారు. భారత దేశ అభివృద్ధిలో తనదైన పాత్రను పోషించి ప్రజలకు ఉత్తమ సేవలను అందించాలని, పేద ప్రజల పక్షాన పనిచేయాలని ఆకాంక్షించారు. ఇటీవల కాలంలో మన ప్రాంత విద్యార్థులు సివిల్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని, రానున్న రోజుల్లో మన ప్రాంత విద్యార్థులు మరిన్ని సివిల్స్ ర్యాంకులు సాధించి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉద్యోగాలను పొంది మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, సీనియర్ నాయకులు వంకాయల నారాయణ రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీ నరసింహా రెడ్డి, ఎమ్మె సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, యుగంధర్, కానుగు అనంతయ్య, చీపిరి రవి యాదవ్, గాదె సుధాకర్, యాదయ్య గౌడ్, మధు, దార సురేష్ దేశాల జైపాల్, భూషం నరేష్, గుండు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్మీపూర్ వాసి మృతికి స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రే కారణం-కంది శ్రీనివాస రెడ్డి

**వారి నిర్లక్ష్యం తోనే ఈ ఘోరం జరిగిందని వెల్లడి**

**మృతుని కుటుంబానికి కాంట్రాక్టర్ రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్**

**ఆదిలాబాద్, మహా :** ఇటీవల తర్నం వాగులో గల్లంతయి మృతి చెందిన లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండె దత్తు మరణానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్నలే కారణమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. సోమవారం జైనథ్ మండలం లక్ష్మీ పూర్ గ్రామంలోని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. గతంలోనే వంతెన పూర్తయితే ఈ ప్రమాదం జరిగేది కాదని బ్రిడ్జి నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన అప్పటి ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో బ్రిడ్జి ప్రక్కన తాత్కాలిక వంతెన విషయంలో నిర్లక్ష్యం చేసిన కేంద్రంలో అధికార బీజేపీ కి చెందిన ఎమ్మెల్యే పాయల శంకర్ ల నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందన్నారు. ఇది ప్రమాదం కాదని ముమ్మాటికి వారిద్దరూ చేసిన హత్య అన్నారు. మరోవైపు పనులు దక్కించుకున్న గుత్తేదారు కూడా కారణమన్నారు. తక్షణమే మృతుని కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ మునిగెల విటల్, లోక ప్రవీణ్ రెడ్డి, రఫీక్, ఎంఏ షకీల్, డేరా కృష్ణారెడ్డి, అంజాద్, గ్రామస్తులు మహిపాల్ రెడ్డి, ఎల్టీ అశోక్ రెడ్డి, ఏనుగుందుల నర్సిములు, కదరాపు నారాయణ, దాసరి నారాయణ, గడ్డం నారాయణ రెడ్డి, అడ్డి రాజారెడ్డి పాల్గొన్నారు.



## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఆదిలాబాద్, మహా:** పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. సోమవారం బేల మండలంలో పర్యటించిన ఆయన పిట్‌గావ్ మాజీ సర్పంచ్ జాదవ్ సీతారామ్ కు మంజూరైన రూ.60 వేల చెక్కును ఆయన నివాసానికి వెళ్లి అందించారు. సీయంఆర్ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వేం నరేందర్ రెడ్డి**


- అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు
- అమరవీరుల కుటుంబాలకు సత్కారం
- మహిళా సంఘాలకు 50 కోట్ల రుణాల చెక్కుల పంపిణీ



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల ఆవరణంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి పోలీసులు గౌరవ వందనంతో జిల్లా యంత్రాంగం తరపున ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రజలనుద్దేశించి గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి అని అన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఆప్యాయంగా పలుకరిస్తూ, అమరవీరుల కుటుంబాలను సత్కరించారు. జిల్లా జీవన జ్యోతి మహిళ సమాఖ్యకు 80 కోట్ల 02 లక్షల, 89 వేల చెక్కును, మెప్మా ద్వారా జిల్లాలోని 385 మహిళా సంఘాలకు 50 కోట్ల రుణాల పంపిణీ చెక్కును గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు అందజేశారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పాఠశాలల నుండి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన చిన్నారులకు మెమోంటోలు గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి అందజేశారు. తెలంగాణ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు. అంతకుముందు కలెక్టరేట్ ఆవరణలో అమరవీరుల స్మారక స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఆర్డీఓ సంగీత తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల త్యాగాల పునాదుల పై, పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ముఖ్య అతిథి అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల స్ఫూర్తితో తెలంగాణ ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ శాఖలకు సంబంధించి స్టాల్స్ ను సందర్శించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పట్టణ, ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చల్లా నర్సింహ రెడ్డి, శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, రాచకొండ పోలీస్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్ఓ సంగీత, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## సీఏంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్, మహా :** పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. సోమవారం భోరజ్ మండలంలో పర్యటించిన ఆయన బాలాపూర్ గ్రామానికి చెందిన సావాపూరే ఇందిరకు మంజూరైన రూ.60 వేల చెక్కును ఆమె నివాసానికి వెళ్లి అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన జిల్లా ఇన్చార్జి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### అలరింపజేసిన చిన్నారుల సంస్కృతిక కార్యక్రమాలు



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ మైదానంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా మంత్రులు, నగర మేయర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులకు, జిల్లా ప్రజలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలను ఉద్దేశిస్తూ జిల్లా ప్రగతి గురించి వివరించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వారాజు సారయ్య, శ్రీపాల్ రెడ్డి, శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజ్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్ లతో కలిసి స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ఉట్టిపడేలా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరింపజేశాయి. ఈ సందర్భంగా మంత్రి చేతులమీదుగా రైతులకు విత్తనాలను పంపిణీ పంపిణీ చేశారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలు తెలియజేస్తూ ప్రదర్శించిన శకటాలు, ఏర్పాటుచేసిన స్టాల్స్ లను మంత్రి సందర్శించారు. అంతకుముందు ఖిలా వరంగల్ మధ్యకోటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన త్యాగధనులకు ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలను మంత్రి శ్రీనివాసరెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి, ఎం ఎల్ సి లు బస్వరాజు సారయ్య, శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యే లు రేవూరి ప్రకాష్ రెడ్డి, కే ఆర్ నాగరాజు శాలువాలతో సన్మానించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, కె ఆర్ నాగరాజ్, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కవిత బీజేపీ వదిలిన బాణం: మధుయాష్కి గౌడ్



**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్సీ కవితపై తెలంగాణ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ గాంధీ భవన్ లో చిట్ చాట్ లో మధుయాష్కి గౌడ్ వ్యాఖ్యలు చేశారు. కవిత లేడీ మాఫియా డాన్ అని , కవిత బీజేపీ వదిలిన బాణం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కవిత చేయని దందా , స్కాం లేదని విమర్శించారు. బతుకమ్మ పేరుతో కవిత బతుకనేర్చిందని... కేసుల నుండి బయట పడాలంటే కవితకి బీజేపీ సహకారం అవసరం ఉందన్నారు. తాగుడు వల్ల ఆడబిడ్డల పుస్తేలతాడులు తెగుతున్నాయని అన్నారు. కవిత అనేక స్కాములు చేసిందని.. జీఎస్టీ, దొంగ నోట్ల స్కాముల్లో కవిత భాగస్వామి ఉందన్నారు. జాగృతి సంస్థ అవినీతి సంస్థ అని ఆ సంస్థ పై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజీవ్ ప్రతాప్ కేంద్రమంత్రిగా స్కిల్ డెవలప్ చేస్తామని 800 కోట్లు దోచుకున్నారని విమర్శించారు. జాగృతి కోసం ఫీనిక్స్ లాంటి సంస్థల నుండి డబ్బులు వసూలు చేశారని తెలిపారు. కేసీఆర్ కవితకి పిత, తెలంగాణకి పిశాచి అని ఎద్దేవా చేశారు. జై తెలంగాణ అని పిడికిలి బిగించి దోచుకున్నది కేసీఆర్ ఫ్యామిలీ కదా అని ప్రశ్నించారు. కవిత ఏ వ్యాపారం చేసిందని కోట్ల రూపాయలు సంపాదించిందన్నారు. అవినీతి సొమ్మును జాగ్రత్తగా కాపాడుకోవడానికే కవిత జాగృతిని బలోపేతం చేస్తోందని మధుయాష్కీ గౌడ్ విమర్శించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా ఆదేశాల మేరకే కవిత పనిచేస్తోందన్నారు. బీఆర్ఎస్ వీక్ అయితే బీజేపీ లబ్ధి పొందుతుందని... తెలంగాణ రాక ముందు వసూళ్ల కోసం వాడుకున్న సంస్థ జాగృతి అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ వచ్చాక రైతులకు సహాయం చేస్తామని అన్నారని... కవిత ఇప్పటిదాకా బీసీ, ఎస్సీలకు నయాపైసా సహాయం చేయలేదని... స్వార్ధ రాజకీయాల కోసమే బిసి నినాదం ఎత్తుకుందన్నారు. బీసీల కోసం మాట్లాడుతున్న కవిత జాగృతిని బీసీల చేతిలో పెట్టలేదని ప్రశ్నించారు. కేసీఆర్ జీవిత లక్ష్యం తెలంగాణ సాధన కాదని... తెలంగాణకి ముఖ్యమంత్రి కావడమే అని అన్నారు. తనని ముఖ్యమంత్రిని చేస్తే పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేస్తానని సోనియాకి చెప్పాడని గుర్తు చేశారు. చెట్ల సంతోష్ ఇప్పుడు చెట్లను ఎందుకు నాటడం లేదని ప్రశ్నించారు. అమెరికా, దుబాయ్ లలో కేటీఆర్, కవితలకి పెట్టుబడులు ఉన్నాయన్నారు. ఇన్వెస్ట్మెంట్ చూసుకోవడానికే కేటీఆర్ విదేశాలకు వెళ్తున్నారని తెలిపారు. సోనియా గాంధీ గారు తెలంగాణ ఇవ్వకపోతే కేసీఆర్, కేటీఆర్ మొహంజాహీ మార్కెట్లో గులాబీ పూలు అమ్ముకునే వాళ్ళని అన్నారు. తెలంగాణ రాకపోతే కవిత ఏపీలో బ్యూటీ పార్లర్ పెట్టుకునేదని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు కేసీఆర్ జెండా కూడా ఎగరేయలేదని విమర్శించారు. లిక్కర్ స్కాంలో కేసీఆర్ కూడా భాగస్వామి అని... లిక్కర్ స్కాం చర్చలు జరిగింది ప్రగతి భవన్ లోనే అని మధుయాష్కీ గౌడ్ ఆరోపించారు.

# వైభవంగా శ్రీ మెట్ల బావి ధన మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

### పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 34 డివిజన్ లోని శ్రీ మెట్ల బావి ధన మైసమ్మ దేవి దేవాలయంలో ద్వితీయ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా కదిలి వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శనం చేసుకున్న వారిలో పుర ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వాణి దంపతులు, తో పాటు బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి శోభాయాత్రలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు తోట బాబన్న, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కరాటే ప్రభాకర్, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వరంగల్ తూర్పు మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముఖ్య నాయకుల తో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# భారాస కార్యాలయంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జెండాను ఆవిష్కరించిన ఉద్యమ నేత నన్నపునేని



**వరంగల్ మహా ;** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం వరంగల్ జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం తో పాటు పలు డివిజన్లలో జాతీయ జెండా, బి ఆర్ఎస్ పార్టీ జెండాను వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆవిష్కరించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు, ప్రజలకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యమ నేత నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఒక కల. ఆ కల కోసం ఎందరో యువతీ యువకులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, తమ ప్రాణాలను అర్పించారు. వారి త్యాగాలతోనే ఈ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఆ త్యాగాలకు నివాళి అర్పించే పర్వదినంగా ఏర్పడిందన్నారు. తెలంగాణ సాధనలో కీలకపాత్ర పోషించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్యాగాలు చిరస్మరణీయమని నరేందర్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్నా తెలంగాణ కోసం పదవికి రాజీనామా చేయడం, నిరాహార దీక్ష చేపట్టడం, రాజకీయంగా ప్రతిఘటనలను ఎదుర్కొంటూ ప్రజల శబ్దంగా మారడం ఇవన్నీ ఉద్యమానికి ఊపునిచ్చాయని అన్నారు. 2001లో టీఆర్ఎస్ స్థాపనతో మొదలైన పోరాటం, 2014 జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావంతో విజయవంతమైంది. కేసీఆర్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి, పదేళ్ల పాటు తెలంగాణను అభివృద్ధి మార్గంలో నడిపించారు. నీటి ప్రాజెక్టులు, రైతు బంధు, విద్యుత్, సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారని నన్నపునేని నరేందర్ గుర్తుచేశారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర ఉండాలి. వర్గాల మధ్య భేదాలు కాదు, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని మనం కలసి పనిచేస్తేనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు దిడ్డి కుమార్ స్వామి, మరుపల్లి రవి, మాజీ కార్పొరేటర్లు భయ్యా స్వామి, కుందారపు రాజేందర్, కొంతం మోహన్, మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్ బాబు, మాజీ ఆర్టీఏ మెంబర్ గోరంట్ల మనోహర్, డివిజన్ అధ్యక్షులు, ఇన్చార్జీలు, మహిళా నాయకురాలు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్ మహా;** బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ జిల్లా కార్యాలయం ధర్మారంలో జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారందరికీ నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ ప్రజల శ్రమ, త్యాగం, ఆత్మగౌరవానికి ప్రతీకగా అవతరించిన చారిత్రాత్మక మైలురాయని మన పోరాట శక్తిని, ప్రజల అభివృద్ధి లక్ష్యాన్ని, ఆత్మగౌరవాన్ని గర్వంగా గుర్తుచేసే పవిత్రమైన రోజు అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు బిజెపి మద్దతు ఇవ్వడంలో తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్ కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ఉద్యమం సమయంలో ఆమె పార్లమెంట్ లో తెలంగాణ గొంతుకను బలంగా వినిపించారు. తెలంగాణ ప్రజలు తెలంగాణ చిన్నమ్మగా పిలుచుకుంటారని, 2017 చివర్లో జరిగిన పారిశ్రామిక వేత్తల సదస్సులో మాట్లాడిన ఆమె "నేను మీ తెలంగాణ చిన్నమ్మను" అనగానే సభ చప్పట్లతో మార్మోగిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం 60 ఏళ్లుగా ప్రసవ వేదన చెందుతుందని, తల్లి గర్భం నుంచి తెలంగాణ బయటకు వచ్చేందుకు నానా యాతన పడుతుందని ఆ తల్లి పడుతున్న వేదనను అర్థం చేసుకున్న సుష్మ స్వరాజ్ గారు తెలంగాణ ఉద్యమం సమయంలో గల్లీ నుంచి ఢిల్లీ వేదికల వరకు పదే పదే చెబుతూ రాష్ట్ర ఏర్పాటుకు మొదట నుంచి అండ దండగా ఉంటూ వచ్చిన మహిళ నేత సుష్మ స్వరాజ్ . ఢిల్లీ వేదికగా నిర్వహించిన ప్రతి ఆందోళనలకు హాజరై రాష్ట్ర ఏర్పాటుకు తొలి నుంచి ఆమె అండగా నిలబడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాల్సిందేనని పట్టుబట్టి మద్దతుగా నిలిచారు. మన రాష్ట్ర ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు,ఎన్నో త్యాగాల మీద విద్యార్థుల బలిదానాల మధ్య అనేక మంది ప్రజా పోరాటాలతో తెలంగాణ ఆవిర్భవించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు బైరి మురళి కృష్ణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, గడల కుమార్, పైర్ద ఆనంద్, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, కార్యాలయ కార్యదర్శి కంది క్రాంతి కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, బిజెపి సీనియర్ నాయకులు మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బుద్ధ శ్రీనివాస్ బిజెపి నాయకులు చిలువేరు రాజేందర్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, కోమాకుల నాగరాజు, మార్త ఉషారాణి, కొంతం సంగీత్, కందుకూరి శ్రీనివాస్, గోదాసి అశ్విన్ తో పాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిధిగా హాజరయ్యి కమిషనరేట్ కార్యాలయ అవరణలో జాతీయ జెండా ఆవిష్కరించి జాతీయ గీతాన్ని అలపించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సోమవారం అదాలత్ సెంటర్లోని అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి అమరవీరులకు ఘన నివాళులర్పించారు. పోలీస్ కమిషనర్ కమిషనర్ చేతుల మీదుగా చిన్నారులతో పాటు పోలీస్ సిబ్బందికి మిఠాయిలను అందజేసి రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలియజేసారు.

**ప్రతిభ కనబరిచిన సిబ్బందికి పతకాలను అందజేసిన మంత్రి**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో విధుల్లో రాణించిన పోలీస్ సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్కృష్ట సేవా, అతి ఉత్కృష్ట సేవా పతకాలను రాష్ట్ర ఆటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా అందజేసారు. ఉత్కృష్ట సేవా పతకం అందుకున్న వారిలో కానిస్టేబుళ్ళు మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, రాజు,యాదగిరి, శ్రీనివాస్, హోంగార్డులు అక్బర్ పాషా, వీరరాఘవ రావు, అశోక్ ఉన్నారు. అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకున్న వారిలో ఏ.ఎస్.ఐ రాజయ్య, హెడ్ కానిస్టేబుళ్ళు విజయ సేనా రెడ్డి, మహిపాల్ రెడ్డి,రాజు,ఉస్మాన్, మనోహర్, జాన్‌విల్సన్ (ఇతను చనిపోతే అతని కుటుంబ సభ్యులు స్వీకరించారు) బానోత్ యాకుబ్ వున్నారు. ఈ సందర్భంగా పతకాలను అందుకున్న సిబ్బందికి మంత్రి కొండా సురేఖ, తో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హన్మకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, రవి, ప్రభాకర్ రావు తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు ఇతర విభాగాలకు చెందిన పోలీస్ పరిపాలన సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

# ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



**హన్మకొండ మహా:** హన్మకొండ పోలీస్ కమీషనరేట్ కార్యాలయ ఆవరణలోని పరేడ్ గ్రౌండ్స్ లో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో మంత్రి కొండా సురేఖ, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ పరేడ్ ను పర్యవేక్షించారు. వివిధ పోలీస్ విభాగాలు పరేడ్ లో పాల్గొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, జిల్లా సమగ్ర ప్రగతి ని వివరిస్తూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ సందేశం ఇచ్చారు. రాష్ట్ర సాధనలో అమరులైన వారి కుటుంబ సభ్యులను మంత్రి కొండా సురేఖ సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, ఆర్టీసీ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పౌరసరఫరాలు, మత్స్య, తదితర శాఖలు ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ తయారు చేసిన శకటాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ ఆకట్టుకునేలా రూపొందించిన ఆయా శకటాల సంబంధిత శాఖల అధికారులకు మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. పలు గీతాలకు విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

# ప్రజల భాగస్వామ్యంతోనే వంద రోజుల ప్రణాళిక విజయవంతం

### నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

### వంద రోజుల ప్రణాళిక పోస్టర్ ను ఆవిష్కరించిన మేయర్ ఎమ్మెల్యే కమిషనర్



**వరంగల్ మహా;** ప్రజల భాగస్వామ్యం తోనే వంద రోజుల ప్రణాళిక విజయవంతం అవుతుందని నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో 100 రోజుల ప్రణాళిక అమలు పై తెలంగాణ రైజింగ్ 2047' లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ,మేయర్, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి పాల్గొని ఇందుకోసం రూపొందిన పోస్టర్ ను ఆవిష్కరించి కార్యక్రమ అమలుకు సంబంధించిన ప్రతిజ్ఞను అధికారులు, సిబ్బంది చే నిర్వహింపజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి నగరం పచ్చదనంగా పరిశుభ్రంగా ఉండాలని ఆకాంక్షించి 100 రోజుల కార్యక్రమానికి రూపకల్పన చేయడం జరిగిందని, నగరాల్లో అమలు చేయాలన్న సంకల్పం తో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రభుత్వ మార్గ నిర్దేశం ప్రకారం వంద రోజులలో చేపట్టే కార్యక్రమాలను మున్సిపల్ కార్పొరేషన్ తరపున చేపట్టడం జరుగుతుందని, ఇందులో భాగం గా పర్యావరణాన్ని పరిరక్షించడానికి మొక్కలను నాటడం, భువన్ అప్ ద్వారా భవనాల వాస్తవ విస్తీర్ణ సమాచార నమోదు, పన్నులు చెల్లించడం, వర్షాకాలం నేపథ్యంలో నగరం ముంపుకు గురికాకుండా వంద రోజులపాటు నిరంతరంగా డిసిల్టేషన్ కార్యక్రమాలను నిర్వహించడం, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా మలేరియా విభాగం నుండి ఫాగింగ్ తో పాటు దోమల నియంత్రణకు మురికి నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం గంబుసియ చేపలను పెంచడం, జంక్షన్ల అభివృద్ధి చేయడం, నగరం లో రెండు ఒక పార్కులను ఎంపిక చేసుకొని వారంలోగా అభివృద్ధి చేసి ప్రారంభించుకోవడం, బల్దియా తరపు నిరంతరం కొనసాగే కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం సూచించిన 100 రోజుల కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో ఐఎంఏ పాత్ర మరువలేనిది

### వరంగల్ శాఖలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**వరంగల్ మహా;** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐఎంఏ భవనంలో జరిగిన వేడుకల్లో వైద్యులు, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐఎంఏ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ కే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనేది ప్రజల సమిష్టి కృషి ఫలితమని ఈ పర్వదినాన్ని ప్రతి సంవత్సరం జరుపుకోవడం గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ అనంతరం జాతీయ గీతం ఆలపించారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో ఆనాడు వరంగల్ ఐఎంఏ పాత్ర ను గుర్తు చేసారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజిత్ మహమ్మద్ మాట్లాడుతూ సాధించుకున్న తెలంగాణ ను ఆరోగ్య తెలంగాణ గా మార్చాలని జిల్లాలోని వైద్యులందరు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ కాళీ ప్రసాద్ రావు, డా విజయ చందర్ రెడ్డి, డా నాగేంద్ర బాబు, డా అశోక్ రెడ్డి, డాక్టర్ బందెల మోహన్ రావు, డా మోహన్ రావు, డా మల్లేశం డా కస్తూరి ప్రమీల, డా జనార్దన్, డా శేషు మాధవ్, డా ప్రవీణ్, జనరల్ సెక్రటరీ డా అజిత్ మహమ్మద్, తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.

# బల్దియాలో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన నగర మేయర్ గుండు సుధారాణి

### పాల్గొన్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్లు, అధికారులు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి కమిషనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులు అర్పించారు. మొదటగా తెలంగాణ రాష్ట్ర స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్, భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎందరో మేధావులు, మహానుభావుల తపన ఆకాంక్షల తోపాటు తెలంగాణ అమరవీరుల త్యాగాల ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించిందని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వంలో గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్లు, బల్దియా ఉన్నతాధికారులు, అధికారులు, జేఏసి ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్



**వరంగల్ మహా;** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, డి ఆర్ ఓ విజయలక్ష్మి , కార్యాలయ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్‌వో యూఏఎన్ యాక్టివేషన్ గడువు పెంపు




ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) పథకానికి సంబంధించి ముఖ్యమైన చర్యల గడువును ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) మరోసారి పొడిగించింది. ఉద్యోగులు తమ యూనివర్సల్ అకౌంట్ నెంబర్ (యూఏఎన్)ను యాక్టివేట్ చేసుకుని బ్యాంక్ అకౌంట్‌ను ఆధార్‌తో లింక్ చేసుకోసుకునేందుకు గడువును జూన్ 30 వరకు పొడిగించింది.

**యూఏఎన్ అంటే..**


యూఏఎన్ అనేది వేతన ఉద్యోగులకు ఈపీఎఫ్ఓ ఇచ్చే 12 అంకెల సంఖ్య. ఇది ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైనది. వ్యక్తి ఉద్యోగం మారినప్పటికీ ఒకేలా ఉంటుంది. ఉద్యోగులు తమ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్)ను ఆన్‌లైన్లో సులభంగా యాక్సెస్ చేసుకోవడానికి, నిర్వహించడానికి యూఏఎన్ సహాయపడుతుంది.

**యూఏఎన్ యాక్టివేట్ చేయడం ఎలా?**

ఉద్యోగులు ఆధార్ ఆధారిత ఓటీపీ (వన్ టైమ్ పాస్వర్డ్) ఉపయోగించి తమ యూఏఎన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు. ఆ ప్రక్రియ ఎలాగో చూడండి.. ఈపీఎఫ్ఓ మెంబర్ పోర్టల్‌ను సందర్శించండి. "ఇంపార్టెంట్ లింక్స్" విభాగం కింద "యాక్టివేట్ యూఏఎన్" పై క్లిక్ చేయండి. యూఏఎన్, ఆధార్ నెంబర్, పేరు, పుట్టిన తేదీ, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఆధార్ ఓటీపీ వెరిఫికేషన్‌కు పర్మిషన్ ఇవ్వడానికి 'అగ్రీ' క్లిక్ చేయండి. మీ ఆధార్ లింక్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ రావడానికి "గెట్ ఆథరైజేషన్ పిన్" పై క్లిక్ చేయండి. యాక్టివేషన్ పూర్తి చేయడానికి ఓటీపీ ఎంటర్ చేయండి. మీ యూఏఎన్ యాక్టివేట్ అయిన తర్వాత, మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు పాస్వర్డ్ వస్తుంది.

# మియావాకి ఫారెస్ట్‌ను విస్తరిస్తున్న రియల్టీ కంపెనీ

ప్రముఖ ఎకో రియల్టీ సంస్థ స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ ప్రపంచంలోనే అతిపెద్ద మియావాకి ఫారెస్ట్‌ను మరింత విస్తరిస్తూ 'వుడ్స్ శంషాబాద్' రెండో దశను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.300 కోట్ల ఆదాయం సమకూరుతుందని కంపెనీ అంచనా వేసింది. భారత్‌లో సుస్థిర నివాస స్థలాలకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది బలపరుస్తుందని తెలియజేసింది. వుడ్స్ శంషాబాద్ స్థానిక పర్యావరణ వ్యవస్థను పెంపొందించేలా జపనీస్ పర్యావరణ పునరుద్ధరణ పద్ధతి మియావాకి అటవీకరణ పద్ధతిని అమలు చేస్తుంది. దీని ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో అడవిని తలపించేలా పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ పర్యావరణాన్ని పెంపొందిస్తారు. గత మూడేళ్లుగా అభివృద్ధి చేసిన మొదటి దశలో భాగంగా ఇప్పటికే 4,50,000 చెట్లు, మొక్కలతో స్వయం సమృద్ధి సాధించినట్లు కంపెనీ తెలిపింది. ఫేజ్ 2తో స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ 100 ఎకరాల్లో దీన్ని విస్తరించాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా 150 కొత్త స్థానిక వృక్ష జాతులను సాగు చేయడం, 141 పక్షి జాతులు, 126 పండ్లు, పుష్పించే చెట్లను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్ ఫౌండర్, సీఈఓ కీర్తి చిలుకూరి ఈ విస్తరణపై మాట్లాడుతూ..'ఫేజ్ 1లో భాగంగా కంపెనీ అన్ని అంచనాలను అధిగమించింది. సుస్థిర జీవన నమూనాకు పెరుగుతున్న డిమాండ్‌ను ఇది ధ్రువీకరించింది. ఫేజ్ 2 వ్యక్తులు, కుటుంబాలకు ప్రత్యేకమైన రోజువారీ మెరుగైన జీవన వాతావరణాన్ని అనుభవించేందుకు మరిన్ని అవకాశాలను అందిస్తుంది' అన్నారు.




## వ్యవస్థలో మూలుగుతున్న రూ.2000 నోట్లు!



రెండు వేల రూపాయల నోట్లకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక గణాంకాలు వెల్లడించింది. రూ.2000 నోట్లు రద్దయి రెండేళ్లు గడిచినా ఇంకా చెలామణిలో ఉన్నాయని ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసిన రిపోర్ట్‌లో తెలిపింది. మే 31, 2025 వరకు ఇంకా వ్యవస్థలో రూ.6,181 కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయని చెప్పింది. 2023 మే 19 నాటికి చెలామణిలో ఉన్న రూ.2000 నోట్లలో 98.26% మాత్రమే తిరిగి వచ్చాయని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. 2023 మే 19న చలామణిలో ఉన్న రూ.2000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ ప్రకటన రోజున చలామణిలో ఉన్న రూ.2000 నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్ల నుంచి 2025 మే 31 నాటికి రూ.6,181 కోట్లకు పడిపోయిందని ఆర్‌బీఐ పేర్కొంది. రూ.2000 నోట్ల రద్దు సమయంలో 2023 అక్టోబర్ 7 వరకు బ్యాంకు శాఖల్లో వీటి డిపాజిట్ లేదా మార్పిడి చేసుకునే అవకాశం ఉందని ఆర్‌బీఐ తెలిపింది. దాంతో చాలామంది వారి వద్ద ఉన్న నోట్లను సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి మార్చుకున్నారు. అప్పటికీ మార్చుకోలేనివారు ఆ తేదీ తరువాత దేశవ్యాప్తంగా ఆర్‌బీఐకు చెందిన 19 కార్యాలయాల్లో ఈ నోట్లను మార్చుకునే వీలు కల్పించింది. 2023 అక్టోబరు 9 నుంచి ఆర్‌బీఐ ఇష్యూ కార్యాలయాలు రూ.2000 నోట్లను బ్యాంక్ ఖాతాలలో డిపాజిట్ చేయడానికి స్వీకరిస్తున్నాయి. అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలో 19 ఆర్బీఐ కార్యాలయాలు ఉన్నాయి. నేరుగా వీటి ద్వారా రూ.2000 నోట్లను మార్చుకోవచ్చు. లేదా పోస్ట్ ద్వారా ఆర్బీఐ ఇష్యూ కార్యాలయాలకు పంపవచ్చు.

## భారీగా పెరిగిన ఇన్ఫీ సీఈఓ వేతనం..

ప్రముఖ సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) సలీల్ పరేఖ్ వార్షిక వేతనం 2025 ఆర్థిక సంవత్సరంలో 22 శాతం పెరిగినట్లు వార్షిక నివేదికలో తెలిపారు. దాంతో ఆయన వేతనం రూ.80.6 కోట్లకు చేరుకుందని కంపెనీ పేర్కొంది. ఆయన వేతనం పెరుగుదలకు ప్రధాన కారణం తనకు అనుసంధానించిన నియంత్రిత స్టాక్ యూనిట్లు (ఆర్ఎస్‌యూ), ఈక్విటీ విలువ పెరగడమేనని తెలిపింది. 2025 ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్‌కు పోటీగా ఉన్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో వంటి కంపెనీ సీఈఓల వేతనం కంటే కూడా సలీల్ ప్యాకేజీ అధికంగా ఉండడం గమనార్హం. దేశంలో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ ఎగుమతిదారుగా ఉన్న టీసీఎస్ సీఈఓ, ఎండీ కె.కృతివాసన్ వేతనం 2025 ఆర్థిక సంవత్సరంలో 4.6 శాతం పెరిగి రూ.26.5 కోట్లకు చేరుకుంది. విప్రో సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ పలియా వేతనం 10 శాతం పెరిగి 6.2 మిలియన్ డాలర్లకు లేదా సుమారు రూ.53.6 కోట్లకు చేరుకుంది. 2022 ఆర్థిక సంవత్సరంలో పరేఖ్ పారితోషికం రూ.71 కోట్ల నుంచి రూ.56 కోట్లకు తగ్గింది. సలీల్ పరేఖ్ స్టాక్ ఆప్షన్ల ద్వారా రూ.49.5 కోట్లు ఆర్జించగా, గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.39 కోట్లుగా ఉంది. బేస్ పే కింద రూ.7.5 కోట్లు, రిటైర్డ్ బెనిఫిట్స్ కింద రూ.50 లక్షలు పొందారు. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.19.8 కోట్లుగా ఉన్న ఆయన వేరియబుల్ వేతనం 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.23.2 కోట్లకు పెరిగింది. కంపెనీ ఉద్యోగుల సగటు వేతనం రూ.10.72 లక్షలుగా ఉందని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా ఏఐ, క్లౌడ్, డేటా, డిజిటల్ రంగాల్లో ఇన్ఫోసిస్ అగ్రగామిగా ఉందని వాటాదారులకు రాసిన లేఖలో పరేఖ్ పేర్కొన్నారు. ఈ ఏడాదిలో కంపెనీ 15,000 మంది కాలేజీ గ్రాడ్యుయేట్లను రిక్రూట్ చేసుకుందని, ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 3,20,000 మందికి పైగా ఉద్యోగులున్నట్లు తెలిపారు.






# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




# ఒంటరి నిర్భంధమే... భరించలేని శిక్ష

## జపాన్ జైళ్లలో దుర్భర పరిస్థితులు

### దశాబ్దాలుగా మారని చట్టాలు

### 'హకామడ' ఉదంతంతో మళ్లీ తెరపైకి



ఇవావో హకామడ. ఇటీవల అంతర్జాతీయంగా మారుమోగిన కేసు. జపాన్‌లో శిక్షల తీవ్రత, అక్కడి నేర న్యాయవ్యవస్థ గురించి మరోసారి చర్చకు తెరతీసిన కేసు. 89 ఏళ్ల హకామడ మాజీ ప్రొఫెషనల్ బాక్సర్. తను పనిచేసే సంస్థ యజమానిని, అతడి కుటుంబాన్ని హత్య చేశాడన్న ఆరోపణలపై 1968లో కోర్టు అతనికి మరణశిక్ష విధించింది. దాని అమలును పెండింగ్‌లో పెట్టడంతో ఏకంగా 50 ఏళ్లకు పైగా జైలు జీవితం గడిపాడు! ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం జైలు జీవితం గడిపిన మరణశిక్ష ఖైదీగా రికార్డులకెక్కాడు. అయితే, పోలీసుల చిత్రహింసలకు తట్టుకోలేకే చేయని నేరాన్ని ఒప్పుకోవాల్సి వచ్చిందని హకామడ ఇటీవల వాపోయాడు. ఈ కేసులో సాక్ష్యాలు తారుమారైనట్టు షిజుయోకా జిల్లా కోర్టు కూడా 2024 మార్చిలో అనుమానం వ్యక్తం చేసింది. పునర్విచారణకు ఆదేశిస్తూ హకామడను విడుదల చేసింది. అనంతరం 2024 సెప్టెంబర్ 26న అతన్ని నిర్దోషిగా ప్రకటించింది. అర్ధశతాబ్దానికి పైగా అక్రమంగా నిర్బంధించినందుకు 21.7 కోట్ల యెన్లు (సుమారు రూ.12.5 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జపాన్‌లో అత్యధిక క్రిమినల్ నష్ట పరిహారంగా ఇది రికార్డు సృష్టించింది. దీని వెనక హకామడ సోదరి హిడెకో దశాబ్దాల పోరాటం దాగుంది. లాయర్లను కలవడం, పిటిషన్లు వేయడం, ప్రజా మద్దతు కూడగట్టడం... ఇలా ఆమె చేయని ప్రయత్నం లేదు. కానీ సోదరుడు ఎట్టకేలకు విడుదలయ్యాడన్న ఆనందం కూడా ఆమెకు మిగల్లేదు. 55 ఏళ్ల ఒంటరి నిర్బంధం హకామడ మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీయడమే అందుకు కారణం. జపాన్ జైళ్లలో ఖైదీల దుస్థితికి ఇది తాజా తార్కాణంగా నిలిచింది.

**రాత్రంతా రోదనే!**

జపాన్ జైళ్లలో అత్యంత కఠిన నిబంధనలు అమలవుతాయి. పలు నేరాలకు ఒంటరి నిర్బంధాన్ని శిక్షగా అమలు చేస్తారు. తోటి ఖైదీలతో మాట్లాడటం దేవుడెరుగు, తమలో తాము కూడా గట్టిగా మాట్లాడుకునేందుకు అనుమతి ఉండదు! పైగా వారిని కలిసేందుకు కుటుంబీకులు, లాయర్లను తప్ప స్నేహితులతో పాటు ఎవరినీ అనుమతించరు. ఉత్తర ప్రత్యుత్తరాలను పూర్తిగా సెన్సార్ చేస్తారు. వ్యక్తిగత వస్తువులను అత్యంత పరిమితంగా అనుమతిస్తారు. కూర్చోవడం, నడవడం, మాట్లాడటం, తినడం, నిద్రపోవడం అన్నీ పక్కాగా టైం ప్రకారం చేయాల్సిందే. ఒక్క సెకను అటూ ఇటూ అయినా శిక్ష తప్పదు. అతి శీతల వాతావరణంలో కూడా టోపీలు, గ్లవ్స్ ధరించడానికి వీల్లేదు. అధికారులపై ఫిర్యాదుకు, సంఘటితం కావడానికి హక్కుండదు. ఏ నిబంధనను కాస్త ఉల్లంఘించినా గార్డుల చేతిలో చావుదెబ్బలే! గంటల తరబడి మోకాళ్లపై కూర్చోబెడతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖైదీలు తీవ్రంగా కుంగిపోతుంటారు. అయితే ఏడ్వడంపై ఆంక్షలు లేవు. దాంతో చాలామంది ఖైదీలు రాత్రిళ్లు ఏడుస్తుంటారు. ఖైదీలను ఇలా ఏళ్లపాటు ఒంటరిగా నిర్బంధించడంపై హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ వంటి మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయినా జపాన్ న్యాయవ్యవస్థలో దశాబ్దాలుగా ఎలాంటి సంస్కరణలు జరగలేదు.

**శిక్షలు అత్యంత కఠినం**

జపాన్‌లో శిక్షలు చాలా కఠినంగా ఉంటాయి. చిన్న నేరాలకు కూడా జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధిస్తారు. కొద్ది మోతాదులో డ్రగ్స్ దొరికినా, వాడినా ఏడాది నుంచి పదేళ్ల జైలు, 50 లక్షల యెన్ల జరిమానా విధించవచ్చు. క్రిమినల్ కేసులు రుజువయ్యే రేటు ఏకం 99 శాతం! బలమైన సాక్ష్యాలుండి, గెలుస్తామని నమ్మిన కేసులనే ప్రాసిక్యూటర్లు దాఖలు చేస్తారు. చాలా కేసుల్లో విచారణకు ముందే నిందితులు నేరం అంగీకరిస్తారు. కనుక జపాన్‌లో ఒకసారి అభియోగాలు నమోదైతే ఇక నిర్దోషిగా బయటపడటం అసాధ్యమేనన్న విమర్శలూ ఉన్నాయి.

**నేరాలు చాలా తక్కువ**


ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన దేశాల్లో ఒకటిగా జపాన్‌కు పేరుంది. సమర్థ నేర న్యాయ వ్యవస్థ దాని సొంతం. 2023లో అక్కడ నమోదైన మొత్తం నేరాలు కేవలం 7 లక్షలు. వాటిలో అత్యధికం దొంగతనాలే. అరెస్టు తర్వాత అనుమానితులను 48 గంటల దాకా అదుపులో ఉంచుకునే అధికారం పోలీసు లకు ఉంది. తర్వాత కేసును ప్రాసిక్యూటర్‌కు అప్పగిస్తారు, వారు 24 గంటల్లోపు నిందితుడిని విచారించి తదుపరి నిర్బంధానికి న్యాయమూర్తి అనుమతి పొందాలి. అలా 23 రోజుల దాకా నిర్బంధించొచ్చు. ఈ విధానంపై అనేక విమర్శలున్నాయి.

**జైలు గోడలు బద్దలైనా... ఒక్కరూ పారిపోలేదు!**

**జైళ్లలో తీవ్ర నిర్బంధ పరిస్థితులున్నా పారిపోయేందుకు మాత్రం ఖైదీలు కల్లో కూడా సాహసించరు! దొరికితే శిక్షల తీవ్రత రెట్టింపవుతుంది మరి! పైగా జపాన్‌లో తప్పించుకుని ఎంతోకాలం తిరగడం అసాధ్యం. 1923 సెప్టెంబర్ 1న తీవ్ర భూకంపానికి యొకోహామాలో జైలు గోడ కూలింది. ఆ సమయంలో జైల్లో 1,100 మంది ఖైదీలున్నా కనీసం ఒక్కరు కూడా పారిపోలేదు. కూలిన గోడల లోపలే గడిపారు. దాంతో ముచ్చటపడ్డ జైలు డైరెక్టర్ ఖైదీలను ఒక రోజంతా బయటి తిరిగొచ్చేందుకు అనుమతించారు. 24 గంటలు పూర్తవుతూనే ప్రతి ఖైదీ టంచనుగా తిరిగొచ్చాడు!**

# ఆపరేషన్ స్పైడర్ వెబ్

## మెగా దాడులు సక్సెస్.. రష్యాకు తగిన శాస్తే జరిగింది




కీవ్: ఉక్రెయిన్ తాజాగా రష్యా సైనిక వైమానిక స్థావరాలపై భీకర డ్రోన్ దాడులకు పాల్పడింది. ఈ మెగా దాడులను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమర్థించుకున్నారు. ఇది అద్భుతమైన ఆపరేషన్‌గా అభివర్ణించిన ఆయన.. రష్యాకు భారీ స్థాయిలో నష్టం కలిగించిందని, ఆ దేశానికి తగిన శాస్తేనని ప్రకటించారు. 'స్పైడర్స్ వెబ్' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో ఉక్రెయిన్ మొత్తం 117 డ్రోన్‌లను ఉపయోగించిందని, దీనికి తగిన సంఖ్యలో డ్రోన్ ఆపరేటర్లు పాల్గొన్నారని జెలెన్స్కీ చెప్పారు. వారు రష్యా వైమానిక స్థావరాలలో ఉంచిన వ్యూహాత్మక క్రూయిజ్ క్షిపణి వాహక నౌకలను ఢీకొట్టేలా చేశారని పేర్కొన్నారు. తమ సిబ్బంది ఈ దాడులు చేసేందుకు ఏడాది పాటు ప్రణాళిక వేశారని, అది ఇప్పుడు ఇది సంపూర్ణంగా అమలయ్యిందని, ఇది పూర్తిగా ప్రత్యేకమైన ఆపరేషన్ అని గట్టినమ్మకంతో చెబుతున్నానని జెలెన్‌స్కీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ దాడితో రష్యన్లు 40 యూనిట్లకు పైగా వ్యూహాత్మక వైమానిక స్థావరాలను కోల్పోవడం తనకు సంతృప్తికరంగా అనిపించిందని, తాము ఇటువంటి దాడులను ఇకముందు కూడా కొనసాగిస్తామని జెలెన్‌స్కీ తెలిపారు. ఈ దాడిలో కీవ్ సహాయం అందించిన వారిని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు ఆయన తెలిపారు. తాము దాడి చేయడానికి కొద్దిసేపటి ముందు, తమకు రష్యా మరో దాడికి సిద్ధమవుతోందని ఇంటెలిజెన్స్ నుంచి సమాచారం అందిందని ఆయన అన్నారు. ఉక్రెయిన్ ప్రజలను అన్ని విధాలుగా రక్షించుకుంటామని అన్నారు. తాము ఈ యుద్ధాన్ని కోరుకోలేదని, యుద్ధాన్ని కొనసాగించాలని ఎంచుకున్నది రష్యన్లే అని జెలెన్‌స్కీ ఆరోపించారు. ఇస్తాంబుల్‌లో మాస్కో కైవ్ మధ్య జరగనున్న శాంతి చర్చలకు ఒక రోజు ముందు ఉక్రెయిన్ ఈ దాడులకు దిగడం గమనార్హం.

ఇదిలా ఉంటే.. రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం 2022 ఫిబ్రవరి లో ప్రారంభమైంది. ఇరు దేశాలు పరస్పరం సరిహద్దు షెల్లింగ్, డ్రోన్ దాడులు, రహస్య దాడులు చేసుకుంటున్నాయి. కాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్నారు. ఈ యుద్ధాన్ని ముగించడానికి ఒక ఒప్పందం కుదుర్చుకోవాలని ఆయన సూచించారు.

## ఉగ్రవాదానికి తావు లేదు: శశి థరూర్



**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ కేంద్రంగా విస్తరిస్తున్న ఉగ్రవాదంపై పలు దేశాలకు తెలియజేస్తూ, అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, కొలరాడోలో జరిగిన దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం, యునైటెడ్ స్టేట్స్‌లో ఉగ్రవాదానికి తావులేదన్నారు. కొలరాడోలోని బౌల్డర్‌లో జరిగిన ఉగ్ర దాడిపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందించారు. 'బౌల్డర్‌లో ఈరోజు జరిగిన ఉగ్రదాడి గురించి భారత ఎంపీల ప్రతినిధి బృందం సభ్యులు తెలుసుకున్నారని, ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని తెలియగానే ఉపశమనం పొందామని, ఉగ్రవాదానికి మన దేశాలలో స్థానం లేదు' అని శశిథరూర్ తన 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు. థరూర్ ప్రతినిధి బృందం ప్రస్తుతం బ్రెజిల్ లో ఉంది. మంగళవారం అమెరికాకు చేరుకోనుంది. కొలరాడోలోని బౌల్డర్ డౌన్ టౌన్‌లోని కోర్టు భవనం సమీపంలో మొహమ్మద్ సబ్రీ సోలిమాన్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడని, ఈ దాడిలో అనుమానితుడు కాక్‌టెయిల్స్, తాత్కాలిక ఫ్లేమ్‌త్రోవర్‌ను ఉపయోగించాడని అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనాల ప్రకారం దాడికి పాల్పడిన వ్యక్తి 'ఫ్రీ పాలస్తీనా' అంటూ కేకలు వేశాడు. హమాస్ నిర్బంధంలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయాలని కోరుతూ 'రన్ ఫర్ దేర్ లైవ్స్' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తుండగా, అక్కడికి సమీపంలోనే ఈ దాడి జరిగిందని యాంటీడిఫమేషన్ లీగ్ తెలిపింది.



## ఏకాంత వీడియోలు ఒక్కొక్కరివిగా బయటకు..!

పాక్‌లో టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లతో పాపులర్ అయిన కొందరు యువతుల ప్రైవేట్ వీడియోలు గత కొన్నిరోజులుగా వైరల్ అవుతున్నాయి. విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న మినాహిల్ మాలిక్, ఇమ్షా రెహమాన్‌ల వీడియోలు తొలుత సర్క్యులేట్ కావడంతో.. వాళ్లకున్న మిలియన్ల ఫాలోవర్లు షాక్‌కు గురయ్యారు. ఆ వెంటనే టాక్ షోలు, మ్యూజిక్ వీడియోలతో పాపుల్ అయిన మథీరా ఖాన్ వీడియో వైరల్ అయ్యింది. తాజాగా.. కన్వాల్ అఫ్తాబ్ అనే మరో ఇన్‌ఫ్లుయెన్సర్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వీడియోలను ఆ ఇన్‌ఫ్లుయెన్సర్లు ఖండిస్తున్నారు. అవి తమవి కావని, ఇదంతా ఏఐ సృష్టి అని వివరణలు ఇస్తున్నారు. పనిలో పనిగా ఫిర్యాదులు చేస్తూ.. చట్టపరమైన చర్యలకు వెళ్తున్నామని ప్రకటించారు. మినాహిల్ ఓ అడుగు ముందుకు వేసి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేసింది. అయితే ఆ కామెంట్ తీవ్ర విమర్శలకు దారి తీసింది. అందుకు కారణం.. ఆమె చేసింది బాలీవుడ్ నటి కరీనా కపూర్ గతంలో చెప్పిన మాటలు కావడం!. ఇదిలా ఉంటే.. ఈ డర్టీ వ్యవహారంలో భారత్ ప్రస్తావనతో అక్కడి టీవీ చానెల్స్‌లో చర్చలు నడిపిస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంతో అక్కడి మీడియా ఛానెల్స్‌ను, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో చాలామందిని భారత్ నిషేధించింది. ఈ క్రమంలో ఇది భారత్ నుంచి జరుగుతున్న వ్యవహారమేనని అక్కడి మీడియా చర్చ జరపడాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌కు చెందిన ఎకనామిక్ టైమ్స్ ప్రముఖంగా ఓ కథనం ఇచ్చింది.

## థగ్‌లైఫ్ సినిమా విడుదలపై హైకోర్టుకు కమల్ హాసన్..




**బెంగళూరు:** కన్నడ భాషా వివాదంపై ప్రముఖ నటుడు కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న 'థగ్‌లైఫ్' సినిమాను కర్ణాటకలో విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. జూన్ 5న ఈ సినిమా విడుదల ఎలాంటి అడ్డంకులు లేకుండా తగిన భద్రతా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ క్రమంలో కర్ణాటక ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ ఎం.నరసింహులు కమల్ హాసన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. కన్నడ భాషనే కాదు, రాష్ట్రాన్ని అవమానపరిచేలా వ్యాఖ్యలు చేసిన కమల్ హాసన్ కన్నడ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. 'కమల్ హాసన్ క్షమాపణలు చెప్పాలనేది సినిమా ఇండస్ట్రీ కోసం కాదు.. రాష్ట్రం కోసం. కమల్ చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికీ రాజకీయ,కన్నడ అనుకూల సంస్థలు తమ అభిప్రాయాన్ని ఇప్పటికే చెప్పాయి. క్షమాపణలు చెప్పకుండా థగ్ లైఫ్ సినిమాను విడుదల చేస్తామంటే తాము ఒప్పుకోబోమని, అడ్డంకులు సృష్టించామని సూచించారు. రాష్ట్రంలో ఎగ్జిబిటర్లు,డిస్టిబ్యూటర్లు సినిమాను విడుదల చేయడం లేదు. క్షమాపణలు చెప్పకుండా థగ్‌లైఫ్ ఎలా విడుదల చేస్తామో మేమూ చూస్తాం' అని హెచ్చరికలు జారీ చేశారు. తమిళం నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే, కన్నడ భాషను కించ పరిచేలా వ్యాఖ్యలు చేసినందుకుగాను కమల్ తన వ్యాఖ్యలకు క్షమాణలు చెప్పాలని కోరారు. ఆ విజ్ఞప్తులపై కమల్ హాసన్ స్పందిస్తూ బలవంతంగా తనతో క్షమాపణలు చెప్పించే ప్రయత్నం చేయొద్దని నొక్కాణించారు. ఈ తరుణంలో థగ్ లైఫ్ సినిమా విడుదల కోసం కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించడం గమనార్హం.

## ఛాన్సుల కోసమే అలాంటి పని చేయడం లేదు: నటి



వెండితెరపై గ్లామర్‌గా నటించడం తప్పా అని చాలా మంది కథానాయికలు ప్రశ్నించారనే విషయం తెలిసిందే. ఇప్పుడు మలయాళ నటి 'మాళవిక మీనన్' కూడా అదే అడుగుతోంది. తమిళ, మలయాళ చిత్రాల్లో ఈ కేరళా కుట్టికి భారీగానే అభిమానులు ఉన్నారు. దీంతో మాతృభాషలో నటిస్తూనే కోలీవుడ్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. తెలుగులో కూడా 'అమ్మాయిలు అంటే అదో రకం, వందనం' అనే రెండు చిత్రాలతో తన లక్‌ను చూసుకుంది. కానీ, ఇక్కడ అనుకున్నంతగా ఛాన్సులు రాలేదు. కానీ, మళ్లీ తెలుగు ఇండస్ట్రీలో అవకాశాల కోసం ఈసారి గట్టిగానే ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ అమ్మడు తమిళంలో ఇవన్ వేర మాదిరి, విళా, బ్రహ్మన్, వెత్తువెట్టు, నిజమానిళలా వంటి పలు చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. అయితే ఈ బ్యూటీ చిత్రాలతోపాటు సామాజిక మాధ్యమాల్లోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన గ్లామరస్ ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ కుర్రక్రారును ఆకట్టుకుంటుంది. దీంతో చిత్రాల్లో పక్కింటి అమ్మాయిగా కనిపించే మాళవిక మీనన్ గ్లామర్‌గా మారడానికి కారణం అవకాశాల కోసమా? అనే ప్రశ్న చాలా మంది అడుగుతున్నారని పేర్కొంది. అయితే అలాంటిదేమీ లేదని చెప్పింది. అయినా గ్లామర్‌గా నటించడంలో తప్పేంటి అని ప్రశ్నించింది. మలయాళ చిత్రాల్లో గ్లామర్‌గా నటించే అవకాశం ఉండదని, తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో అలా నటించవచ్చునని పేర్కొంది. అయినా సామాజిక మాధ్యమాల్లో తన గ్లామరస్ ఫొటోల గురించి అడుగుతున్నారని, తాను మాత్రమే అలా చేస్తున్నానా అని ప్రశ్నించింది. అయినా ఫేక్ అకౌంట్లతో అవాస్తవాలు రాస్తూ ముఖం చూపడానికి భయపడే వారు సామాజిక మాధ్యమాల్లో తన గురించి ఉన్నవి, లేనివి ప్రచారం చేస్తున్నారని, అలాంటి వాటి గురించి పట్టించుకోవలసిన అవసరం లేదనే అభిప్రాయాన్ని మాళవిక వ్యక్తం చేసింది.

## అప్పుడేమో డిజాస్టర్..
## ఇప్పుడేమో రికార్డులు తిరగరాస్తోంది!



'ఖలేజా' సినిమాతో నిండా మునిగాడు నిర్మాత సింగనమల రమేశ్. కొమురం పులి, ఖలేజా సినిమాలతో ఏకంగా రూ.100 కోట్లు నష్టపోయానని ఆ మధ్య తన బాధను వ్యక్తం చేశాడు. మహేశ్‌బాబు (Mahesh Babu) హీరోగా నటించిన ఖలేజా సినిమా షూటింగ్ జాప్యం ఒక కారణమైతే ప్రేక్షకులు దాన్ని డిజాస్టర్‌గా మల్చడం మరో కారణం. కానీ ఆ సినిమా ఇప్పుడు అద్భుతాలు సృష్టిస్తుండటం విశేషం!

**అప్పడలా.. ఇప్పుడిలా..**

2010లో త్రివిక్రమ్ డైరెక్షన్‌లో వచ్చిన ఖలేజా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. కానీ తర్వాత టీవీల్లో మాత్రం జనాలు బాగానే చూసేవారు. అసలే కొంతకాలంగా రీరిలీజ్ ట్రెండ్ నడుస్తోంది. బిజినెస్‌మ్యాన్, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, పోకిరి, ఒక్కడు.. ఇలా మహేశ్ సినిమాలే చాలావరకు రీరిలీజ్ అయ్యాయి. తాజాగా మహేశ్ తండ్రి, సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని ఖలేజాను 4కె వర్షన్‌లో రీరిలీజ్ చేశారు.

**నీ వల్ల అవుద్ది సామి**

ఇంకేముంది, మరోసారి జనం థియేటర్లకు క్యూ కట్టారు. కొత్త సినిమాలను సైతం పక్కకు నెట్టి ఖలేజా సినిమాను వీక్షిస్తున్నారు. కేవలం మూడు రోజుల్లోనే ఈ మూవీ రూ.11.83 కోట్లు రాబట్టినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. రీరిలీజ్‌లో అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన తెలుగు చిత్రంగా ఖలేజా నిలిచింది. ఇది చూసిన అభిమానులు.. ఈ రికార్డులన్నీ కేవలం నీ వల్లే అవుతాయి సామి అంటూ కామెంట్లు చేస్తున్నారు.

### త్వరలోనే మరో రీరిలీజ్

**ఖలేజా సినిమాలో మహేశ్‌బాబుకు జంటగా హీరోయిన్ అనుష్క నటించింది. ప్రకాశ్ రాజ్, రావు రమేశ్, సునీల్, షఫీ, అలీ, సుబ్బరాజు ఇతర పాత్రలు పోషించారు. మణిశర్మ సంగీతం అందించాడు. అతడు తర్వాత త్రివిక్రమ్- మహేశ్ డైరెక్షన్‌లో వచ్చిన రెండో చిత్రమిది. ఈ సినిమా ఫ్లాప్ అయినప్పటికీ ఉత్తమ ప్లేబ్యాక్ సింగర్, ఉత్తమ గేయరచయిత విభాగంలో రెండు ఫిలింఫేర్ సౌత్ అవార్డులు అందుకుంది. ఇకపోతే మహేశ్‌బాబు బర్త్‌డే సందర్భంగా ఆగస్టు 9న అతడు చిత్రాన్ని మళ్లీ రిలీజ్ చేయనున్నారు.**

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## రిటైర్మెంట్ ప్రకటించిన గ్లెన్ మాక్స్‌వెల్



ఆస్ట్రేలియా స్టార్ ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ వన్డేలకు మాక్స్‌వెల్ వీడ్కోలు పలికాడు. ఫైనల్ వర్డ్ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాక్సీ తన నిర్ణయాన్ని వెల్లడించాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని తన స్థానంలో యువ ఆటగాళ్లకు అవకాశమిచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు 36 ఏళ్ల మాక్స్‌వెల్ వెల్లడించాడు. ఆసీస్ చీఫ్ సెలక్టర్ జార్జ్ బెయిలీతో చర్చించాకే 50 ఓవర్ల ఫార్మాట్ నుంచి తన తప్పుకుంటున్నట్లు ఈ స్టార్ ఆల్‌రౌండర్ తెలిపాడు. పదేపదే గాయాల బారిన పడడం కూడా మాక్సీ ఆకస్మిక రిటైర్మెంట్‌కు ఒక ప్రధాన కారణం కావచ్చు. ఇక ఈ విషయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా కూడా ధ్రువీకరించింది. 2012లో ఆస్ట్రేలియా తరపున అరంగేట్రం చేసిన మాక్స్‌వెల్.. తన 13 ఏళ్ల వన్డే కెరీర్‌లో ఎన్నో అసాధారణ ఘనతలను అందుకున్నాడు. ముఖ్యంగా వన్డే ప్రపంచకప్2023లో అఫ్గానిస్తాన్‌పై మాక్సీ ఆడిన ఇన్నింగ్స్ సదరు క్రికెట్ అభిమానికి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఓ వైపు గాయంతో బాధపడుతూ ఒంటి కాలితో అఫ్గానిస్తాన్‌పై విరోచిత డబుల్ సెంచరీతో మాక్స్‌వెల్ చెలరేగాడు. ఆఖరి వరకు క్రీజులో ఉండి తన జట్టును సెమీఫైనల్‌కు మాక్స్‌వెల్ చేర్చాడు. ఇక తన వన్డే కెరీర్ లో 149 వన్డేలు ఆడిన మాక్స్‌వెల్.. 4,000 పరుగులు సాధించాడు. అదేవిధంగా అతడు 77 వికెట్లు కూడా వన్డేల్లో పడగొట్టాడు. 2015, 2019లో ఆస్ట్రేలియా ప్రపంచ కప్ విజయాలు సాధించడంలో గ్లెన్ మాక్స్‌వెల్ కీలక పాత్ర పోషించాడు. చివరగా ఆస్ట్రేలియా తరపున వన్డే మ్యాచ్ ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడాడు. కాగా దాదాపు ఎనిమిదేళ్ల నుంచి టెస్టులకు కూడా దూరంగా ఉన్న మాక్స్‌వెల్.. ఇకపై కేవలం టీ20ల్లో మాత్రమే కొనసాగే ఛాన్స్ ఉంది.


## చరిత్ర సృష్టించిన ఆదిల్ రషీద్

ఇంగ్లండ్ స్పిన్ బౌలర్ ఆదిల్ రషీద్ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లలో అత్యధిక వికెట్లు తీసిన ఇంగ్లండ్ స్పిన్నర్‌గా అవతరించాడు. వెస్టిండీస్‌తో నిన్న (జూన్ 1) జరిగిన రెండో వన్డేలో ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో 4 వికెట్లు తీసిన రషీద్ తన వన్డే వికెట్ల సంఖ్యను 221కి పెంచుకున్నాడు. రషీద్ టీ20ల్లో 131, టెస్ట్‌ల్లో 60 వికెట్లు తీశాడు. మొత్తం కలిపి రషీద్ తన అంతర్జాతీయ కెరీర్‌లో 298 ఇన్నింగ్స్‌ల్లో 412 వికెట్లు తీశాడు. ఇంగ్లండ్ క్రికెట్ చరిత్రలో మరే స్పిన్నర్ ఇన్ని వికెట్లు తీయలేదు. నిన్నటి మ్యాచ్‌లో రషీద్ గ్రేమ్ స్వాన్‌ను (223 ఇన్నింగ్స్‌ల్లో 410 వికెట్లు) అధిగమించి అత్యధిక వికెట్లు తీసిన ఇంగ్లిష్ స్పిన్నర్‌గా అవతరించాడు.

**అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన టాప్-5 ఇంగ్లండ్ స్పిన్నర్లు..**

ఆదిల్ రషీద్412 (298 ఇన్నింగ్స్‌లు)
గ్రేమ్ స్వాన్410 (223)
మొయిన్ అలీ366 (318)
అండర్‌వుడ్329 (175)
జాన్ ఎంబురే223 (164)

ఓవరాల్‌గా ఇంగ్లండ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన రికార్డు దిగ్గజ పేసర్ జేమ్స్ ఆండర్సన్ పేరిట ఉంది. ఆండర్సన్ ఇంగ్లండ్ తరఫున 560 ఇన్నింగ్స్‌ల్లో 991 వికెట్లు తీశాడు (మూడు ఫార్మాట్లు కలిపి). ఆండర్సన్ తర్వాత స్టువర్ట్ బ్రాడ్ (485 ఇన్నింగ్స్‌ల్లో 847 వికెట్లు), ఇయాన్ బోథమ్ (283 ఇన్నింగ్స్‌ల్లో 528 వికెట్లు), డారెన్ గాఫ్ (252 ఇన్నింగ్స్‌ల్లో 466 వికెట్లు) ఇంగ్లండ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లుగా ఉన్నారు. ఈ జాబితాలో ఆదిల్ రషీద్ ఐదో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మొదటి నలుగురు పేసర్లే కావడం విశేషం. ఇదిలా ఉంటే, నిన్న వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 20 తేడాతో కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ కీసీ కార్టీ సెంచరీతో (103) చెలరేగడంతో 47.4 ఓవర్లలో 308 పరుగులు చేసింది. అనంతరం జో రూట్ భారీ సెంచరీతో (166 నాటౌట్) చెలరేగడంతో ఇంగ్లండ్ 48.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆదిల్ రషీద్ 4 వికెట్లు తీసి వెస్టిండీస్‌ను ఆలౌట్ చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ సిరీస్‌లో నామమాత్రపు మూడో వన్డే లండన్‌లోని కెన్నింగ్‌స్టన్ ఓవర్‌లో జూన్ 3న జరుగనుంది.




## ఆసియా కప్ 2025 వాయిదా

జూన్ 6 నుంచి శ్రీలంకలో జరగాల్సిన మహిళల టీ20 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ 2025 వాయిదా పడింది. ప్రతికూల వాతావరణం మరియు ఆరోగ్య పరిస్థితులు కారణంగా టోర్నీని వాయిదా వేస్తున్నట్లు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) సోమవారం (జూన్ 2) ప్రకటించింది. టోర్నీని వాయిదా వేయాలని ఆతిథ్య బోర్డు (శ్రీలంక) అధ్యక్షుడు షమ్మీ సిల్వా ఏసీసీకి లేఖ రాశాడు. ఈ లేఖను పరిగణలోకి తీసుకొని ఏసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం శ్రీలంకలో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు వాతావరణం అనుకూలంగా లేదని, ఆ ప్రాంతంలో చికున్‌గున్యా వ్యాప్తి చెందుతుందని సిల్వా తన లేఖలో పేర్కొన్నాడు. టోర్నీ తదుపరి షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని ఏసీసీ అధ్యక్షుడు మొహిసిన్ నఖ్వీ వెల్లడించాడు. కాగా, ఏసీసీ మహిళల టీ20 ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ 2023లో తొలిసారి జరిగింది. హాంగ్‌కాంగ్ వేదికగా నాడు జరిగిన టోర్నీలో భారత్ ఏ విజేతగా నిలిచింది. ఫైనల్లో భారత్ బంగ్లాదేశ్ ఏను 31 పరుగుల తేడాతో ఓడించి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నీలో భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంక ఏ జట్లతో పాటు యూఏఈ, నేపాల్, థాయ్‌లాండ్, మలేసియా జట్లు పాల్గొంటాయి.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com